ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 26.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 26 ఏప్రిల్ 2024



నేడు షర్మిల రాక

ఏలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. న్యాయ్ బస్సు యాత్రలో భాగంగా కృష్ణా జిల్లా తిరువూరులో పర్యటన ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు చింతలపూడి బస్‌స్టేషన్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గోపన్నపాలెం చేరుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. ఇప్పటికే వైసీపీని ఎండ గట్టడంలో షర్మిల దూకుడుగా వ్యవహరిస్తూ నీరసించిన కాంగ్రెస్ కాస్తంత ఊపిరిపోశారు. ఇప్పుడు నియోజకవర్గాల పర్యటనకు రానుండటంతో కాంగ్రెస్‌లో కాస్తంత ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్‌లు వేశారు. షర్మిల బస్సు యాత్రకు కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి భాగస్వాములైన సీపీఐ, సీపీఎం శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ పిలుపునిచ్చారు.

బాదుడే..బాదుడు!



- ఏటా 15 శాతం ఆస్తి పన్నుల పెంపు
- ప్రజలపై పెనుభారం మోపిన జగన్ ప్రభుత్వం
- గత ఎన్నికల వేళ పన్నులు పెంచమంటూ వైసీపీ నాయకుల హామీలు
- గెలిచాక ఇష్టారాజ్యంగా వసూళ్లు

ఏలూరు టూ టౌన్, ఏప్రిల్ 25 : ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాట ఇది వైసీపీ ప్రభుత్వం తీరు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మేము అధికారంలోకి వస్తే ఎటువంటి ఆస్తి పన్నులు పెంచం. మా అభ్యర్థులను గెలిపించండి అని వాగ్దానాలు చేశారు. తీరా ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత ఆస్తిపన్నులు, చెత్తపన్నులు, నీటి పన్నులు విపరీతంగా పెంచేశారు. అదేమని అడిగితే ప్రభుత్వం పన్నులు పెంచింది. మీరు కట్టాల్సిందే మేము ఏమి చేయలేమని ప్రజా ప్రతినిధులు తప్పించుకుంటున్నారు.

జీవోలతో భారం

2021 సంవత్సరంలో 196, 197, 198 జీవోలను వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ప్రకారం ఆస్తి పన్నులు ఆస్తి విలువ ఆధారంగా పెంచినట్టు జీవోలోని సారాంశం. నివాస గృహాలపై ఆస్తి విలువలో 0.12 శాతం, వాణిజ్య భవనాలకు 0.30 శాతం, ఖాళీ స్థలాలకు 0.50 శాతం పన్నులు విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అద్దె ఇల్లు ప్రతిపాదికగా ఆస్తి పన్ను వసూలు చేసేవారు. ఇప్పుడు ఆస్తి విలువ ఆధారంగా పన్నులు పెంచారు. అంతేకాకుండా ఏటా 15 శాతం పెంచే విధంగా జీవోలో ఉంది. మూడేళ్ల నుంచి ఈ జీవోల ప్రకారం ఏడాదికి 15 శాతం పెంచుతూ వస్తున్నారు. ఈ కొత్త విధానంతో 100 నుంచి 300 శాతం వరకు పన్నులు పెరిగాయి. దీంతో ఆస్తి పన్ను తడిసి మోపెడై ప్రజలకు పెనుభారంగా మారింది.

విలీన గ్రామాల్లో మూడు రెట్లు..

విలీన గ్రామాల్లో ఆస్తి పన్నులు విపరీతంగా పెంచేశారు. గతంలో పంచాయతీల్లో తక్కువగా ఆస్తి పన్ను ఉండేది. ఇప్పుడు వాటిని నగర పాలక సంస్థ ఆస్తి పన్నుల జీవోల ప్రకారం పెంచారు. దాంతో గతంలో పన్ను కంటే మూడు రెట్లు పెరిగింది. విలీన గ్రామ పంచాయతీలో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి 2021- 22 ఆర్థిక సంవత్సరానికి రూ.2,486 ఆస్తి పన్ను చెల్లించాడు. అదే వ్యక్తి ఈ ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.4,008 పన్ను కట్టాల్సి వచ్చింది. రెండేళ్ల వ్యవధిలో రూ.1,522 పెంచేశారు. ఇలా ప్రతీ ఏడాది 15 శాతం పెంచుకుంటూ పోతున్నారు. 2021 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పన్నుల విధానం అమలులోకి వచ్చింది. ఆ ఏడాది కరోనా సమయం కావడంతో ఆ ఏడాది 15 శాతం పెంచకుండా వదిలివేసి ఆ మరుసటి ఏడాది పెరిగిన 15 శాతం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇంకో 15 శాతంతో మొత్తం 30 శాతం అదనంగా వసూలు చేశారు. విలీన గ్రామాలైన తంగెళ్ళమూడి, సత్రంపాడు, శనివారపుపేట, పోణంగి, వెంకటాపురం, చొదిమెళ్ళ కొమడవోలు గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి కానరావడం లేదు. పైగా ఆస్తి పన్నులు అధికంగా పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారు. నగరంలో గ్రామాలు విలీనమైతే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు ఆశించారు. దానికి విరుద్ధంగా పెన్నుల పెంపులో అభివృద్ధి చూసి ప్రజలు బెంబెలెత్తుతున్నారు. పన్నులైతే విపరీతంగా పెరిగాయి. కానీ విలీన గ్రామాల్లో రోడ్డు, డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలను మోసం చేస్తున్నారు..



ఎన్నికలకు ముందు ఆస్తి పన్ను పెంచేది లేదని వాగ్దానాలు ఇచ్చి ఎన్నికల తర్వాత ఆస్తి పన్నులు పెంచి వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. పన్నులు పెంచడం, తగ్గించడం పాలకవర్గ నిర్ణయించాలి. ప్రభుత్వం ఏకపక్షంగా పాలక మండలిలను సంప్రదించ కుండా పన్నులు పెంచడం సరికాదు. ప్రజలపై పెనుభారం మోపే 196, 197 జీవోలను రద్దు చేయాలి. పన్నులు పెంచడం 93, 94 రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధం.

- జి.కోటేశ్వరరావు, 6వ డివిజన్, మొండిలకాలనీ

ఆస్తి విలువ ఆధారంగా పెంచడం సరికాదు..



ఆస్తి విలువ ఆధారంగా పన్నులు పెంచడం వల్ల ఏటా పన్నులు పెరుగుతూనే ఉంటా యి. ఏటా ఆస్తి విలువ పెరుగుతుంది. దానికనుగుణంగానే ఆస్తి పన్నులు విపరీతంగా పెరుగుతాయి. ఇప్పటికే పన్నులు కట్టలేని పరిస్థితి. భవిష్యత్తులో మరింత ఆర్థికభారం ప్రజలపై పడుతుంది. ఏటా 15 శాతం పన్నులు పెంచే విధానాన్ని రద్దు చేయాలి. పాతపద్ధతిలో అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్నులను నిర్ణయించాలి.

- సాల్మన్‌రాజు, లక్ష్మీనగర్

'ఓపెన్' టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఘోర పరాజయ ఫలితాలు!

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 : ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాల్లోనూ జిల్లా భారీ ఫెయిల్యూర్స్‌తో పరాజయాన్ని నమోదు చేసుకుంది. ఈ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. పదో తరగతిలో జిల్లానుంచి 1,073 మంది పరీక్షలకు హాజరు కాగా, వీరిలో కేవలం 74 మంది (6.90 శాతం), ఇంటర్మీడియట్‌లో 1,619 మందికి 415 మంది (25.13 శాతం) ఉత్తీర్ణుల య్యారు. కాగా ఈ ఫలితాలతో టెన్త్‌లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో చివరిదైన 26వ స్థానం, ఇంటర్‌లో 24వ స్థానం లభించాయి. ఓపెన్ పరీక్షల నిర్వహణలో ఎక్కడా 'రాజీ' పడకుండా పకడ్బందీగా నిర్వహించడం, ప్రతీ పరీక్ష కేంద్రానికి ఓ సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించి మాల్ ప్రాక్టీస్‌కు, మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పూర్తి నిఘా మధ్య నిర్వహించడమే ఈ ఫలితాలకు కారణమని జిల్లా విద్యాశాఖ వర్గాలు విశ్లేషించాయి. కాగా జిల్లాలో పరీక్షల నిర్వహణ సరళిని, ఉత్తీర్ణతను గతేడాది నుంచే తెలుసుకున్న పలు విద్యాసంస్థలు తమ విద్యార్థులను పొరుగు జిల్లా నుంచి దరఖాస్తు చేయించగా, ఇప్పుడు ఫలితాల్లోను ఆ జిల్లా అగ్రస్థానంలో ఉండడం గమనార్హమని ప్రచారం జరుగుతోంది. ఇంత తక్కువ ఉత్తీర్ణత నేపథ్యంలో ఇక మీదట ఏలూరు జిల్లాలో ఓపెన్‌స్కూల్స్ దూరవిద్య టెన్త్, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకునే విద్యార్థుల సంఖ్య మరింత తగ్గిపోవడం ఖాయమని విశ్లేషిస్తున్నారు.

10లోగా రీకౌంటింగ్/రీవెరిఫికేషన్‌కు అవకాశం

దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల రీ కౌంటింగ్/ రీ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు ఈ నెల 29నుంచి మే 10వ తేదీలోగా నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 1నుంచి 8 వరకు, ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు జూన్ 10నుంచి 12 వరకు నిర్వహిస్తామన్నారు. సప్లిమెంటర్ పరీక్షలకు ఫీజును ఏపీ ఆన్‌లైన్ ద్వారా అపరాధ రుసుం లేకుండా మే 4వరకు, పెనాల్టీతో మే 10వ తేదీ వరకు చెల్లించవచ్చు. గురువారం విడుదలచేసిన పరీక్షల ఫలితాలను విద్యార్థులు ఏపీ ఓపెన్ స్కూల్స్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు.

ముగిసిన నామినేషన్ల పర్వం

ఎంపీ స్థానానికి 23.. అసెంబ్లీ స్థానాలకు 207 నామినేషన్లు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారంతో నామినేషన్ల కార్యక్రమం ముగిసింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల కార్యక్రమం ఆదివారం మినహా యిస్తే ఏడు రోజులపాటు సాగింది. ఈ నెల 26న నామినేషన్ల పరిశీలిస్తారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. కాగా గురువారం జిల్లాలో మొత్తం 77 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 8 మంది, 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి 69 మంది తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు దాఖలు చేశారు. జిల్లాలో నామినేషన్ల పర్వం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి 23 నామినేషన్లు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 128 మంది అభ్యర్థులు 207 నామినేషన్లు దాఖలు చేశారు.

గురువారం నాటి నామినేషన్ల వివరాలు..

- ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా కావూరి లావణ్య, పర్వతనేని చైతన్యకుమారి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పుట్టా మహేష్‌కుమార్, వైసీపీ అభ్యర్థులుగా కారుమూరి సునీల్ కుమార్, వల్లూరు కీర్తి, భారతీయ జవాన్ కిసాన్ పార్టీ అభ్యర్థిగా కొండ్రు రాజేశ్వరరావు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కండవల్లి జీవ దేవ దయాకర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోడె అజయ్‌బాబు నామినేషన్లు దాఖలు చేశారు.
- ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి జనసేన పార్టీ అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు, వైసీపీ అభ్యర్థిగా పుప్పాల శ్రీనివాసరావు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పెద్దపూడి ధర్మరాజు, ఇండియన్ లేబర్ పార్టీ అభ్యర్థిగా కనికెల్లి మురళీకృష్ణ, స్వతంత్ర అభ్యర్థులుగా పత్సమట్ల భీమరాజు, పుప్పాల శ్రీనివాసరావు, బాతు నాగేశ్వరరావు, పుట్టా కుమార్, నల్లమిల్లి శంకరరావు నామినేషన్లు దాఖలు చేశారు.
- దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా ఆలపాటి నరసింహమూర్తి , ఆలపాటి రేవతి వెంకటచౌదరి, స్వతంత్ర అభ్యర్థులుగా ముళ్ళపూడి అశోక్‌కుమార్, చౌదరి, పల్లి రమేష్, అలగా రవికుమార్, పేరిశెట్టి శివ నగరం ప్రసాద్, కొనకళ్ళ శ్రీనివాసరావు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా చిలుకూరి ప్రభాకరరావు నామినేషన్లు దాఖలు చేశారు.
- ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బడేటి మీనా, సీపీఐ అభ్యర్థిగా ఉప్పులూరి హేమశంకర్, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మత్తేబాబీ, బీఎస్పీ అభ్యర్థిగా అందుగుల రతన్ కాంత్, స్వతంత్ర అభ్యర్థులుగా పోలిశెట్టి తులసీ రామ్, మచ్చా పేద ముసల నాయుడు, నల్లమిల్లి ప్రసన్నకుమార్, రాజనాల శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు.
- పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా కాకా కృష్ణ, బాడిస బొజ్జిదొర, మొడియం శ్రీనివాసరావు, సిరియం సూరమ్మ, సోదెం ముక్కయ్య, బొరగం రాధ, ముచిక రంజిత్ కుమార్ అప్పలరాజు దొర, కర్రేదుల హేమమాలిని, బీఎస్పీ అభ్యర్థిగా మడకం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థులుగా దువ్వెల ప్రవీణ్‌కుమార్, సున్నం ప్రియాంక, జనసేన పార్టీ అభ్యర్థిగా చిర్రి బాలరాజు, భరత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థిగా మొడియం శ్రీనివాస రావు, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థిగా బందం బాలరాజు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా బాలరాజు నామినేషన్లు వేశారు.
- చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం అభ్యర్థిగా సొంగా ఇసాక్ రాజ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా ఉన్నమట్ల రాకాడ ఎలీజా, ఉన్నమట్ల జీవన్‌ప్రభాకర్ కుమార్, వైసీపీ అభ్యర్థిగా కంభం విజయరాజు, స్వతంత్ర అభ్యర్థిగా తొర్లపాటి శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు.
- నూజివీడు నుంచి టీడీపీ అభ్యర్థులుగా కొలుసు పార్థసారథి, కొలుసు నితిన్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా మరీదు కృష్ణ, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా సోము వెంకట శివ పూర్ణచంద్రరావు, స్వతంత్ర అభ్యర్థులుగా మందలపు శ్రీనివాసరావు, కొలుసు కమల లక్ష్మి, దురిశెట్టి అశోక్‌కుమార్, ఆముదాల ఇసాకు నామినేషన్లు వేశారు.
- కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా కామినేని మనోరమ, జైభీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా గొంతుపులుగు సతీష్‌కుమార్, కాంగ్రెస్ నుంచి బొడ్డు నోబుల్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి లావేటి వీర శివాజీ, వైసీపీ నుంచి తిరువీధుల శారద, స్వతంత్రులుగా బొడ్డు కిరణ్‌కుమార్, చెన్నంశెట్టి సోమసుందరరావు, కొప్పుల విజయబాబు, బలే గణేశ్, మాదాసు సత్యనారాయణ, తిరువీధుల శారద, బడుగు సీతా మహాలక్ష్మి, ఏ సోమేశ్వరరావు, బడుగు బాస్కరరావు నామినేషన్లు వేశారు.

గామన్ బ్రిడ్జిపై ఒకవైపే రాకపోకలు

- మరోసారి సాంకేతిక లోపంతో మరమ్మతులు
- నేటి నుంచి పది రోజులపాటు వంతెనపై ఒకవైపే వాహన రాకపోకలు

కొవ్వూరు, ఏప్రిల్ 25: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం-కొవ్వూరు గామన్ బ్రిడ్జి నెల రోజుల వ్యవధిలో మరోసారి మరమ్మతులకు గురైంది. మార్చి 24న గామన్‌బ్రిడ్జి 52వ స్తంభం వద్ద వంతెనకు యాక్షన్ ఇచ్చే బాల్ మరమ్మతులకు గురి కావడంతో వంతెనపై ఒక వైపు రాకపోకలను నిలుపుదల చేశారు. మరమ్మతులు పూర్తిచేసి సుమారు నెల రోజుల తర్వాత ఏప్రిల్ 23న రెండువైపులా వాహన రాకపోకలను అనుమతించారు. అయితే ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో 28వ స్తంభం వద్ద అమర్చిన బేరింగ్‌లో ఎటువంటి ప్రేజర్ రావడం లేదని గుర్తించారు. దీంతో ఈనెల 26 నుంచి మే 3వ తేదీ వరకు ఈ మార్గంలో వాహన రాకపోకలను నిలుపుదల చేస్తున్నట్టు సమాచారం. బేరింగ్ మార్పు చేయడానికి 10 రోజుల పాటు వంతెనపై ఒక మార్గంలోనే వాహన రాకపోకలకు అనుమతించనున్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో నిర్మించిన వంతెనలు వందేళ్లకు పైగా సేవలందించాయి. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన గామన్ వంతెనపై రాకపోకలు ప్రారంభించిన పదేళ్లకే మరమ్మతులకు గురి కావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు దోచుకున్నదే హద్దుగా నిబంధనలను తుంగలో తొక్కి వంతెనల చెంతనే ఇసుక డ్రెడ్జింగ్ చేసి గోదావరి నదిని గుల్ల చేశారు. గోదావరి తీరం వెంబడి ఏటిగట్టును కొల్లగొట్టి ఏర్పాటుచేసిన ఇసుక ర్యాంపులు, ఇసుక తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, ఎస్ఈబీ అధికారులు సైతం ఫిర్యాదుచేసిన వారిని, ఇసుక తవ్వకాలు, రవాణాను అడ్డుకున్న వారిని అరెస్టులు చేశారు తప్ప ఇసుక అక్రమ తవ్వకాలు, అనధికార డ్రెడ్జింగ్‌ను అరికట్ట లేకపోయారు. దీని పర్యవసానమే గామన్‌బ్రిడ్జి మరమ్మతులకు కారణమని గోదావరి జిల్లా వాసులు వాపోతున్నారు.



పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు నామినేషన్ ర్యాలీలో ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, గన్ని వీరాంజనేయులు, తదితరులు

పోలవరం ప్రాజెక్టు కట్టి తీరుతాం

- ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా

కొయ్యలగూడెం, ఏప్రిల్ 25 : ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం ఆయన పోలవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నరసన్నపాలెం వై.జంక్షన్ నుంచి కేఆర్.పురం ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ సాగింది. వేలాది మంది బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెంలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉండగా ప్రాజెక్టును 75 శాతం పూర్తి చేశామని, వైసీపీ అధికారం లోకి వచ్చి ఐదేళ్లు పూర్తయిన మిగిలిన 25శాతం పూర్తి చేయలేదని విమర్శించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు ఇవ్వకుండా నిర్వాసితులను మోసం చేసిందన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయాలనే ఆలోచనే జగన్‌కి లేదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయకుండానే వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గడిపేసిందని విమర్శించారు. ఏలూరు నియోజకవర్గంలో రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయన్నారు. తాము ప్రభుత్వం ఏర్పాటుచేసిన వెంటనే కొయ్యలగూడెంలో డిగ్రీ కాలేజీ, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భారీ మెజారిటీతో ఏలూరు ఎంపీ, పోలవరం ఎమ్మెల్యే సీట్లను కైవసం చేసు కుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బాలరాజు నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ డీసీసీబీ ఛైర్మన్ కరాటం రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఏడు మండలాల కూటమి పార్టీల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 : ఏపీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు గురువారం ఏలూరులోని పదికేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు ఉదయం పూట నిర్వహించిన పరీక్షకు మొత్తం 1,663 మంది హాజరుకాగా, మరో 522 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఇంటర్మీడియట్‌లో ప్రవే శాలకు నిర్వహించిన పరీక్షకు 1,935 మందికి 1,661మంది, డిగ్రీ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాల పరీక్షకు 51 మందికి 33 మంది హాజరయ్యారని తెలిపారు. ఏలూరులోని కేపీడీటీ హైస్కూలు పరీక్షా కేంద్రాన్ని డీఈవో సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు.

మాటల్లేవ్.. దండంతో సరి!



వైసీపీలో వింత తీరు.. గతంలో ఇచ్చిన హామీలు చేయలేక చేతులెత్తేశారా... ఆ పార్టీ అభ్యర్థుల అందరి నోటా సీఎం తరహా రత్నాలే..టీడీపీపై బురద చల్లేందుకే ప్రాధాన్యత.. ఎలాగు కొత్త మేనిఫెస్టో వస్తుందిగా అంటూ సాగదీస్తూ ఎటువంటి కొత్త హామీలు ఇవ్వకుండానే జనంలో పర్యటించడం గమనార్హం. గత ఎన్నికల్లో వైసీపీ నాయకులు హామీలతో అరచేతిలో వైకుంఠం చూపారు. సామాన్యుడికి అందుబాటులో ఉంటామంటూ ఊదర కొట్టారు. టీడీపీ హయాంలో వేసిన అభివృద్ధిపై రచ్చ రచ్చ.. వీలైతే అప్పటి అధికారితో టీడీపీపై తీవ్ర ఆరోపణలు.. విమర్శలు. మరి ఇప్పుడు ఏమనుకున్నారో ఏమో గాని జనాలకు ఎక్కడా వాగ్దానాలు ఇవ్వడం లేదు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

- వైసీపీ అభ్యర్థుల ప్రచారంలో వింత వైఖరి
- కొత్త హామీల ఊసే లేదు..

వాస్తవానికి అధికారమే లక్ష్యంగా గడిచిన ఎన్నికల్లో వైసీపీ జనం చెవులకు చిల్లులు పడేలా వాగ్దానాలు చేసింది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామంటూ గొప్పలు చెప్పింది. ప్రాజెక్టు కోసం సర్వం ధారపోసిన కుటుంబాలకు ఇస్తామన్న సాయం అందలేదు. వాగ్దానం ఎప్పుడో గాలిలో కలిసింది. నిర్వాసితులకు అందాల్సిన పరిహారంలో సొమ్ము చేతులు మారింది. కమిషన్‌ల పేరిట నొక్కుడే నొక్కుడు. ఇందులో అధికార పక్ష నాయకుల పాత్ర ఉన్నట్టు వామ పక్షాలతో సహా మిగతా పక్షాలన్ని ఈ ఐదేళ్లుగా విరుచుకుపడుతూనే ఉన్నాయి. పోలవరం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కాదని ఆయన సతీమణికి వైసీపీ టిక్కెట్ ఇచ్చింది. ఇప్పుడు ఆమె ఓటు వేయమని కోరుతూ గ్రామాల్లో ప్రచారం చేస్తున్నా ఇంతకుముందు బాలరాజు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను మాట వరుసకైనా ప్రస్తావించ కుండా దాటవేస్తున్నారు. పోలవరం నిర్వాసితుల ప్రశ్నలకు తగిన సమాధానం లేదు. చింతలపూడి నియోజకవర్గంలోను ఈ తరహా పరిస్థితే. ఈ నియోజకవర్గంలో దాదాపు అన్ని చోట్ల సమస్యలు కుప్ప కన్పిస్తోంది. దీనిపై ఈ ఐదేళ్లపాటు పాలన చేసిన వైసీపీ ఇప్పుడు నోరెత్తితే ఒట్టు. ఎన్నికల సమయంలో ఓటు వేయండి అంటూ ప్రజలను అభ్యర్థిస్తూ చేతులు జోడిస్తున్నారు. మెట్టలో పంట ఉత్పత్తులు నాశనమైన విషయాన్ని, ఎత్తిపోతలు అదృశ్యమైన విధానం ఎక్కడికక్కడ అయా కాలనీలు, ఇంకా ఎదురు చూస్తున్న వేలాది మందికి ఇళ్ల స్థలాలు గురించి మాట వరుసకైనా ప్రస్తావన లేకుండా పోయింది. డెల్టా ప్రాంతంలో దాదాపు నియోజకవర్గ కేంద్రాలన్నీ మునిసిపాలిటీలే. ఆయా మునిసిపాలిటీల్లో ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి జీరో. దీనికి తోడు ఈ నియోజకవర్గాల్లో తిరిగి సిట్టింగ్‌లే తిరిగి పోటీలో ఉన్నారు. వీరంతా నవరత్నాలు తిరిగి రిపీట్ చేస్తున్నారే తప్ప కొత్తగా ఏం చేస్తారో మాట వరుసకైనా నోరు జారితే ఒట్టు .భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, మునిసిపాలిటీల్లో జన సాంద్రత ఎక్కువ. ఇక్కడి సమస్యలు కో కొల్లలు. వైసీపీ అభ్యర్థులు, వైసీపీ అధినాయకత్వం పట్టించుకోక పోవడంతో ప్రజలు లోలోన ఆగ్రహంగా ఉన్నారు.

వద్దనుకున్నారా.. వదిలేసుకున్నారా..

సాధారణ ఎన్నికల్లో పోటీ కూటమి , వైసీపీ మధ్య జరగబోతుంది. ఈ రెండు పక్షాలకు చెందిన శ్రేణులన్నీ ఇప్పటికే మోహరించాయి. నియోజక వర్గాల వారీగా ఎత్తులు పైఎత్తులకు దిగుతున్నాయి. ఏలూరు లోక్ సభ నియోజకవర్గ పరిధిలో వైసీపీ తన సిట్టింగ్‌లను కొందరినే మార్చింది. చింతలపూడి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఎలీజాను కాదని కొత్త ముఖానికి అవకాశం ఇచ్చారు. ఈ లోక్ సభ స్థానం పరిధిలో పోటీలో ఉన్న మిగతావారంతా సిట్టింగ్‌లే. గడిచిన ఎన్నికల్లో చెప్పిన మాట ఎలాగు నెరవేర్చుకోలేదు. మళ్ళీ అదే చెబితే జనం ఊరుకుంటారా.. అందుకనేమో.. జగనన్న గెలవాలంటే మేము గెలవాలి. నవరత్నాలు ఇచ్చాం కదా మరెన్నో ఇవ్వాల్సి ఉంది. మా కొత్త మేనిఫెస్టోలో ఇవన్నీ ఉంటాయి.. అంటూ అభ్యర్థులు ప్రచారంలో జనాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ పార్టీ అధినేత జగన్ ఎవరూ ఊహించని పథకాలతో మా సరికొత్త మేనిఫెస్టో వస్తుంటూ ప్రకటించారు. అనుగుణంగానే నేతలు, కేడర్ జనాల ఎదుట ఊదర గొడుతున్నారు.

ప్రచారంలో కూటమి అభ్యర్థుల దూకుడు

ఎన్నికల ప్రక్రియ ఆరంభమైన వద్ద నుంచి కూటమి అభ్యర్థులు అంతా తాము గెలిస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు నియోజకవర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రజలు ఎదుట పక్కాగా చెబుతున్నారు. మరోవైపు వైసీపీ తీరును ఎండగడుతున్నారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి అక్కడక్కడ గోతులు పూడ్చి రోడ్లుకు షోకులు చేస్తున్నారు... అంటూ వైసీపీపై విరుచుకుపడుతున్నారు. కూటమి గెలిస్తే శాంతి భద్రతలు పక్కాగా అమలవుతాయి.. సంక్షేమ అభివృద్ధి మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉంటాయి. గడిచిన ఐదేళ్లలో జరిగింది ఏమి లేదు. అందుకనే సరికొత్త బాటలో పయనిస్తామంటూ ప్రచార సభలలో చెబుతున్నారు. డెల్టా ప్రాంతాలోనూ నిలిచిన పోయిన పనులు ప్రస్తావిస్తున్నారు. రైతులకు న్యాయం జరగలేదని బీసీ వర్గాలకు కేవలం పదవులతో ఆశ చూపించి సంక్షేమాన్ని విస్మరించారని పట్టణాభివృద్ధి అదృశ్యమై పన్నుల పెనుభారంగా మార్చారని విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. బీజేపీ కేంద్రం అమలు చేసిన పథకాలను ప్రస్తావిస్తోంది. నరసాపురం లోక్ సభ బీజేపీ బలపరిచిన అభ్యర్థి కూటమి పక్షాన భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర పథకాలే తమకు శ్రీరామ రక్ష అని, ఆఖరికి కరోనా సమయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరించి పేదలకు బియ్యం అందించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఏలూరు లోక్ సభ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తన ప్రచారంలో టీడీపీ మాత్రమే అభివృద్ధి సంక్షేమం చేసి చూపించగలదని నొక్కి చెబుతున్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు జరిగింది ఎంత.. ఎమ్మెల్యేగా మంత్రిగా ఉండి నెరవేర్చింది ఎంత అంటూ నిలదీస్తూనే ప్రచారం చేస్తున్నారు.

మీకు తెలుసా..



ఇప్పటి వరకు 15 ఎన్నికలు

స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రంలో ఇప్పటి వరకు 15 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 952లో తొలిసారి ఫిబ్రవరి 10న ఎన్నికలు జరిగాయి. తర్వాత ఇలా..

1957 ఫిబ్రవరి 25	1989 నవంబరు 22
1962 ఫిబ్రవరి 19	1994 డిసెంబరు 1
1967 ఫిబ్రవరి 8	1999 సెప్టెంబరు 18
1972 మార్చి 15	2004 ఏప్రిల్ 20
1978 ఫిబ్రవరి 25	2009 ఏప్రిల్ 16
1983 మే 1	2014 ఏప్రిల్ 30
1985 మే 3	2019 ఏప్రిల్ 11

16వ సార్వత్రిక ఎన్నికలు మే 13న జరుగనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1952 నుంచి 2009 వరకు 13 సార్లు ఎన్నికలు జరగ్గా, రాష్ట్ర పునర్విభజన తర్వాత ఏపీలో మూడోసారి ఎన్నికలు జరుగబోతున్నాయి.

- ముదినేపల్లి

ఉండి నియోజకవర్గంలో ఎన్నో ఎన్ని'కలలు' కొల్లేరు తీరంతో పాటు గోదావరి కాల్వల శివారు ప్రాంతం కావడంతో నీరు పుష్కలమని భావిస్తారు. నియోజకవర్గం మొత్తం గ్రామాలు తాగునీటికి కటకటలాడతాయి. సాగునీటికి రైతులు ఎదురు చూస్తారు. వరదలు, వర్షాలకు మునిగిపోతారు. బ్రిటిష్ కాలంలో నిర్మితమైన యండగండి లాకుల పునర్నిర్మాణానికి జగన్ హామీ ఐదేళ్లలో కొట్టుకుపోయింది. నియోజకవర్గంలో మురుగు డ్రెయిన్లు గ్రామాలను, రైతులను ముంచేస్తున్నాయి. భారీ ఎత్తున ఆక్వా ఉత్పత్తులు అందించే రైతులకు జగన్ విద్యుత్ షాక్ ఇచ్చారు. గ్రామాల మధ్య బ్రిటిష్ కాలంలో నిర్మితమైన ప్రధాన వంతెనలు శిథిలమయ్యాయి. ఆక్వా ఎగుమతుల రవాణా, ప్రయాణికుల రాకపోకలు భయం భయంగా సాగుతున్నాయి.

ఆక్వా రైతులకు జగన్ షాక్

ఆక్వాజోన్, విస్తీర్ణం పేరుతో ఆక్వారైతులకు ప్రభుత్వం విద్యుత్ షాక్ ఇచ్చింది. సీఎం జగన్ పాదయాత్ర సమయంలో ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలో ఆక్వా చెరువులు పరిశీలించి ఆక్వా చెరువులకు యూనిట్ రూ.1.50కే అందిస్తామని ప్రకటించారు. అధికారంలోనికి వచ్చిన తరువాత కొన్నాళ్ళపాటు హామీని అమలుచేసారు. కరోనా తరువాత ఈ నిబంధనను అమలును నెమ్మది సడలించారు. ఆక్వాజోన్‌లో ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని, విస్తీర్ణం కేవలం 5 ఎకరాలు ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని నిబంధనలు తీసుకువచ్చారు. దీంతో ఆక్వా రైతులకు ఎదురుదెబ్బ తగిలింది. రైతులు సమైక్యమై ఉద్యమించడంతో విస్తీర్ణం10 ఎకరాలకు పెంచారు.



జగన్మాయ





ఎన్నికలల ఉండి

• సాగునీరు లేదు • ఆక్వా రైతులకు విద్యుత్ షాక్ • పాదయాత్ర హామీలు గాలికొదిలేశారు

సీఎం హామీలు

- 1885లో ఉండి పంట కాలువపై యండగండిలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరాయి. ఏటా వరదలు, వర్షాలకు వేలాది ఎకరాల పంట మునుగుతోంది. లాకుల పునర్నిర్మాణంపై జగన్ హామీ మరిచారు.
- ఆకివీడు నుంచి ఉండి మీదుగా భీమవరం జాతీయ రహదారి విస్తరణ పనులు ఇప్పటికీ మోక్షం లభించడంలేదు.
- కొల్లేరు తీర ప్రాంతమైన ఆకివీడు మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరు పూర్తిస్థాయిలో పరిష్కరించలేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించలేదు.
- వెంకయ్య వయ్యేరు పంట కాల్వను ప్రక్షాళన చేయకపోవడంతో మురుగునీటితోనే దప్పిక తీర్చు కోవాల్సిన పరిస్థితి.
- వరి సేద్యానికి సాగునీరు అందించి, తుఫాన్, అధిక వర్షాలకు వరి చేలలో ముంపునీరు త్వరితగతిన బయటకు వెళ్లేలా కాలువలు, డ్రెయిన్ల పనుల హామీ నెరవేరలేదు.
- కోపల్లె - జక్కరం వంతెన నిర్మిస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది.
- గోదావరి జలాలను రూ.4 వేల కోట్లతో ప్రత్యేక పైపులైను ద్వారా తాగునీరు హామీ కార్యరూపం దాల్చలేదు.



ఆకివీడులో రోడ్డు పక్కన కొండలా చెత్త



పూడుకుపోయిన మూలలంక బోదె

ఉండి, కాళ్ళ, ఆకివీడు, ఆకివీడు రూరల్

ఆకివీడు మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరు అందడం లేదు. వెంకయ్య వయ్యేరు పంట కాల్వను ప్రక్షాళన చేయకపోవడంతో మురుగునీటితోనే దప్పిక తీర్చు కోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షా కాలం వరి చేలు, నివాస ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ఆకివీడు పరిధిలో టీడీపీ హయాంలో ఇచ్చిన సెంటున్నర పట్టాలను లబ్ధిదారుల నుంచి వెనక్కి తీసుకొని కొందరికి సెంటు చొప్పున ఇచ్చారు. కొందరికీ స్థలాలు ఇవ్వలేదు. డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణ పరిధిలోని ప్రజలు త్రీవ అవస్థలు పడుతున్నారు. భీమవరం - గుడివాడ రాష్ట్రీయరహదారిపై కోపల్లె వద్ద బొండాడ డ్రెయిన్‌పై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. కాళ్ళ మండలంలోని అన్ని గ్రామాల నుంచి భీమవరం వైపు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. బొండాడ మురుగు కాలువపై జక్కరం - కోపల్లె వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో బిల్లుల భయంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఉండి మండలంలో దీర్ఘకాలిక ప్రధాన సమస్య యండగండి లాకులు. వరదలు, భారీ వర్షాలకు వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయి. పాలకులు పునర్నిర్మాణ పనులు పట్టించుకోవడం లేదు. పంట కాలువలలో గుర్రపుడెక్క, తూడు, చెత్త పేరుకుపోయి సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నాయి. ఆకివీడు మండలంలోని పలు గ్రామాలు మంచినీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రధాన మంచినీటి కాలువ వెంకయ్య వయ్యేరు. ఎగువ మండలాలకు ఇది మురుగు కాలువ. వ్యవసాయం, ఆక్వా, గ్రామాలలోని మురుగు నేరుగా కాలువలోకి వదులడంతో మండల ప్రజలకు కలుషిత నీరే దిక్కు.

బాదుడే.. బాదుడు..

గత ప్రభుత్వ హయాంలో ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్, చెరువు విస్తీర్ణం పరిమితులు లేవు. ఆక్వా చెరువులకు విద్యుత్ సబ్సిడీ అమలు చేశారు. విద్యుత్ టాన్స్‌పార్మర్లు అతి తక్కువ ధరకే అందించారు. గతంలో 25కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రూ. 1.80 లక్షలు కాగా ప్రస్తుతం ఆదర రూ. 3.50 లక్షలు ఉంది. 40, 63కెవి ట్రాన్స్‌ఫార్మర్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆక్వా ఉత్పత్తుల ధరలు అమాంతం పడిపోయాయి. ఫీడ్, సీడ్ ధరలు పెరిగిపోయాయి. నాణ్యతలేని సీడ్, ఫీడ్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వైసీపీ పాలనలో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు, ఆక్వా పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉంది.



కాల్వ ముంచేస్తుంది

పంట కాలువ గుర్రపుడెక్క, చెత్తతో పూడిపోయింది. తొలగింపు చర్యలు లేక పంటలు నీట మునుగుతున్నాయి. వర్షాలకు వరదలకు కాల్వ గట్లు కొంతమేర దెబ్బతిన్నాయి. వేసవిలో పనులను చేపట్టి పూర్తిచేయాలి. వర్షాకాలం వచ్చిదంటే చాలు వరిపొలాలు ముంపు బారినపడుతున్నాయి. పండించిన పంట వర్షార్పాణం అవుతుంది. రైతులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

పీవీఎస్ గోపాకృష్ణంరాజు
రైతు, యండగండి

పంట కాల్వలో కలుషిత నీరు

పంట కాల్వలో వచ్చేది మంచినీరు కాదు. ఆక్వా చెరువుల నీరు కలుస్తోంది. ఆ నీటినే మంచినీటి చెరువులలో నింపి తాగాల్సిన దుస్థితి. పచ్చరంగులో నీరు దుర్వాసన వెదజల్లుతోంది. కాల్వలు తూడు, గుర్రపుడెక్కతో పూడిపోయాయి. వేసవిలో కాల్వ ఎండిపోదు. బురద, ఆక్వా నీటితో బ్యాక్టీరియా పెరిగి రోగాలకు కారణమవుతోంది.

- బొడ్డుపల్లి అప్పనపల్లి, కళింగగూడెం



తాగు నీటి కోసం ఎదురుచూపులు

పెరుగుతున్న జనాభాకనుగుణంగా మంచినీటి చెరువులు విస్తీర్ణం పెరగడం లేదు. వేసవి కాలంలో నీటిని నిలువ చేసుకోవడానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు అత్యవసరం. హామీ బుట్ట దాఖలా అయ్యింది. ఎప్పటి మాదిరిగానే వేసవి వచ్చిందంటే నీటియద్దడి షరా మామూలే. ఇదిలా ఉండగా వర్షాకాలంలో కలుషితమైన నీరే ప్రజలకు దిక్కవుతున్నది.

- నౌకట్ల రామారావు అయిభీమవరం



కూటమికి సైకిల్ గుర్తు లేదు

నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెంలో గ్లాస్, నరసాపురం లోక్‌సభకు కమలం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన 40 ఏళ్ల తర్వాత మూడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ, లోక్‌సభ బ్యాలెట్ పత్రాల్లో సైతం సైకిల్ గుర్తు కనబడదు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కలసి కూటమిగా ఎన్నికల బరిలో దిగాయి. ఆ పార్టీ ఒప్పందం మేరకు నరసాపురం లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి పోటీలో ఉన్నారు. మూడు పార్టీల తరపున అభ్యర్థికి బ్యాలెట్‌లో కమలం గుర్తుతో బరిలో ఉంటారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఒప్పందం మేరకు జనసేన అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండడంతో ఆయా అభ్యర్థులకు గ్లాస్ గుర్తు ఉంటుంది. మూడు నియోజకవర్గాల్లో మొత్తంగా రెండు బ్యాలెట్‌లలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల గుర్తు సైకిల్ కనిపించదు. నాలుగు దశాబ్దాల తరువాత తొలిసారిగా ఈ పరిస్థితి కనిపించడంతో ఓటర్లను ఆయా పార్టీలు అప్రమత్తం చేస్తున్నాయి.

- భీమవరం టౌన్

ఆ బ్యాలెట్‌లో ఏ గుర్తు ఉండదు

పోస్టల్ బ్యాలెట్‌లో టిక్‌లు పెట్టాలి



పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు గతంలో పేపర్ బ్యాలెట్‌పై పార్టీల గుర్తులు ఉండేవి. ఇప్పుడు ఈవీఎంలపై కూడా గుర్తులు ఉంటున్నాయి. నచ్చిన పార్టీ అభ్యర్థి పేరు వద్ద ఉన్న గుర్తుపై మీట నొక్కాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రైవేట్ వ్యక్తులు ఓటు వేయవచ్చు. వారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. ఈ బ్యాలెట్‌పై పార్టీల గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఇంతకు ముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పేపర్‌నే ఉద్యోగులకూ ఇచ్చే వారు. ఈవీఎంలు వచ్చాక ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతరులు యంత్రంలో ఓట్లు వేసే అవకాశం లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండదు. బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.

- ముదినేపల్లి

ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే..

రెండో ఈవీఎం వినియోగం



అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల స్థానంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్‌ను) ఉపయోగిస్తుంటారు. ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ అభ్యర్థులు పోటీలో ఉంటే రెండు ఈవీఎంలను ఉపయోగించవలసి ఉంటుంది. ఒక ఈవీఎంలో 15మంది అభ్యర్థులు ఒక నోటా కలిపి 16మంది వివరాలు నమోదు చేసుకునే వీలు మాత్రమే ఉంటుంది. అంతకంటే ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. కైకలూరు నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 44 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. ఉపసంహరణ తర్వాత కూడా వారంతా పోటీలో ఉంటే రెండు ఈవీఎంలు అవసరమని స్థానికంగా చర్చనీయంశంగా మారింది. మొదటి ఈవీఎంలో 16 మంది రెండో ఈవీఎంలో 16మంది అంతకంటే ఎక్కువ ఉంటే మరో ఈవీఎంలో అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తారు. ఏ పోలింగ్ బూత్‌లో అయిన ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత ఈవీఎం మొరాయిస్తే అప్పటివరకు నమోదైన వివరాలను సీజ్ చేసి రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు.

- కైకలూరు

అమ్మ.. నాన్న.. కుమారుడు..

ముగ్గురూ మంత్రులే..







మాగంటి రవీంద్రనాథ్ చౌదరి, వరలక్ష్మీదేవి, మాగంటి బాబు

ఒకే కుటుంబంలో అమ్మ, నాన్న, కుమారుడు ముగ్గురూ రాష్ట్ర మంత్రులుగా పని చేశారు. దెందులూరు నియోజకవర్గంలో మాగంటి కుటుంబం అరుదైన గుర్తింపు పొందింది. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి దెందులూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాగంటి రవీంద్రనాథ్ చౌదరి దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రిగా పని చేశారు. ఆయన మంత్రి పదవిలో ఉండగానే ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మరణానంతరం 1991లో జరిగిన ఉప ఎన్నికలో మాగంటి రవీంద్రనాథ్ చౌదరి సతీమణి వరలక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యారు. వారి తనయుడు మాగంటి వెంకటేశ్వరరావు(బాబు), 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండేళ్ల తర్వాత మంత్రి వర్గంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రి అవకాశం దక్కింది. ఒకే కుటుంబం, తండ్రి, తల్లి, కుమారుడు మంత్రులు కావడం విశేషం.

- పెదవేగి

ఎన్నికల ఆఫర్

ఓటు వేస్తే.. ఉచిత వైద్యం

ఏలూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆఫర్!!

ఎన్నికల్లో ఓటింగ్‌ను ప్రోత్సహించేందుకు ఏలూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రి వినూత్న ప్రయత్నం చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న వారికి తమ ఆస్పత్రిలో ఆరు నెలలపాటు ఉచిత వైద్యాన్ని అందజేస్తామని ప్రకటించింది. ఆరు నెలల్లో కన్సల్టేషన్ ఫీజులేకుండానే వైద్య సలహాలు ఇస్తామని ఏలూరు ఎన్ఆర్ పేటలోని సిద్ధార్థ ఈఎన్‌టీ, డెంటల్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ సీఎస్.రాజు తెలిపారు. పోలింగ్‌రోజున ఓటు హక్కు వినియోగించుకున్నట్టు ఓటరు వేలిపై సిరా గుర్తును చూపించి ఉచిత వైద్యవైద్యాన్ని పొందవచ్చునని వివరించారు. సాధారణంగా పండుగలు, నూతన సంవత్సరం తదితర ప్రత్యేక సందర్భాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు కస్టమర్లను ఆకర్షించేందుకు ఆఫర్లు ఇస్తారు. వీటికి భిన్నంగా సాధారణ ఎన్నికల్లో ఓటింగ్‌ను పెంచేందుకు ఉచిత వైద్యాన్ని ఆఫర్ చేయడం ఇదే మొదటి సారి అని బావిస్తున్నారు. ఓటుహక్కుని వినియోగించుకునే వారిసంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో సమాజంలో బాధ్యత గల పౌరునిగా ఓ వైద్యుడు ముందుకు వచ్చి ఈ విధంగా ఆఫర్ చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. డాక్టర్ సి.ఎస్.రాజు హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఏపీ శాఖ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

- ఏలూరు అర్బన్



స్వేచ్ఛగా ఓటేయండి

పేరుపాలెంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీస్ అబ్జర్వర్ సిన్హా

పోలీస్ అధికారుల సందర్శన

మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పోలీస్ అధికారులు పరిశీలించారు. గ్రామస్థులు, స్థానికులతో మాట్లాడి స్వేచ్ఛగా ఓటేయాలని సూచించారు. పోలీస్ అబ్జర్వర్ సైలేష్ కుమార్ సిన్హా, డీఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐ గోవిందరాజు, కాశీచరణ్, రామాంజి, ఎస్ఐలు వెంకటరమణ, గుర్రయ్య పేరుపాలెం, కేపీపాలెం, ముత్యాలపల్లి తదితర గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు సందర్శించారు. స్థానికులు, అధికారులతో ప్రశాంత పోలింగ్‌పై సమీక్షించారు.

- మొగల్తూరు



గెలిపించు తల్లీ..

రాట్నాలమ్మకు మొక్కుతున్న చింతమనేని ప్రభాకర్

బీ ఫామ్‌కు చింతమనేని పూజలు

దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చింతమనేని ప్రభాకర్ సతీ సమేతంగా గురువారం పలు ఆలయాల్లో పూజలు చేశారు. రాట్నాలమ్మను దర్శించుకుని టీడీపీ బీ ఫామ్‌కు ప్రత్యేక పూజలు చేయించారు. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి, హనుమాన్ జంక్షన్ అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ తల్లిని దర్శించుకుని బీ ఫామ్‌కు పూజలు చేయించారు. ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుకున్నారు.

- పెదవేగి

పేదల కడుపు నింపిన నామినేషన్

అభ్యర్థుల జన సమీకరణ

సొమ్ములతోపాటు విందు భోజనం



- ఉంగుటూరు

ఎన్నికల బరిలో దిగుతున్న అభ్యర్థులు బల ప్రదర్శన ప్రయత్నాలు కొందరి పేదల కడుపు నింపింది. ఉంగుటూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా జన సమీకరణకు భారీగా డబ్బులు పంపిణీ చేశారని కొందరు ఖుషీ అయ్యారు. అభ్యర్థితో పాటు నామినేషన్ ర్యాలీలో వెళ్లినవారికి పురుషులకు రూ. 600, మహిళలకు రూ.400 చొప్పున ఇచ్చారని కొందరు ఉబ్బితబ్బిబ్బు అయ్యారు. సొమ్ములు దండిగా వస్తున్నాయని జనం ఎగబడ్డారు. ఇంతేకాకుండా మోటారు సైకిల్‌కు రానుపోను రూ.200, ఆటోలకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చి జన సమీకరణ చేశారని వెళ్లిన కొందరు ఆనందపడిపోతున్నారు. నియోజకవర్గ స్థాయిలో డ్వాక్రా యానిమేటర్లు, ఉపాధి హామీ సిబ్బంది సహకారంతో జనం తరలింపులో సేవలందించారని సమాచారం. నామినేషన్ కార్యక్రమం నిర్వహణ నిమిత్తం ఒక్కో గ్రామానికి రూ.40 వేలు గ్రామ స్థాయి నేతలకు బట్వాడా జరిగిందని కొందరు చెబుతున్నారు. ముందుగా సొమ్ములు అందించారని కార్యకర్తలే బాహటంగా వెల్లడిస్తున్నారు. ఇదిలాఉండగా నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరిన కార్యకర్తలకు ఎండవేడిమి చుర్రుమనిపించింది. ఎండవేడిమి తట్టుకోలేని కొందరు సొమ్ములు ముందుగానే అందడంతో సగంలో వెనుదిరగడం కొసమెరుపు.

కోడి కూర.. పండుగొప్ప పులుసు..

నామినేషన్ కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలకు విందు భోజనమే. నారాయణపురం సమీపాన ఖాళీ స్థలాలలో కోడికూర, పండుగప్ప పులుసు, మటన్ కూరతో పసందైన భోజనం ఏర్పాటు చేశారు. ఉక్కపోత వాతావరణంలో రుచికరంమైన భోజనం పూర్తిగా తినలేకపోయారు.

ఉంగుటూరు మండలం నుంచి కూడా వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీగా జన సమీకరణ చేశారు. నామినేషన్ దాఖలుకు ఆఖరి రోజు పలువురికి తాత్కాలిక ఉపాధి లభించినట్లయింది, ర్యాలీగా వెళ్లిన వారికి భారీగానే సొమ్ములు ముట్టాయి. ఆటోలు, మోటార్ వాహనాలపై తరలించారు. ఒక్కొక్కరికి రూ.200 నుంచి రూ.500 వరకు ముట్టజెప్పినట్లు పలువురు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ముట్టచెప్పిన మొత్తం మారింది. ఎన్నికల వేళ.. ఎండలో పనులకు వెళ్లలేని కొందరి కొంత మొత్తం అందినా ఎన్నికల అధికారులు ఈ ఖర్చును ఎలా చూస్తారో..!



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ జనరల్ ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా

ప్రజలు స్వేచ్ఛగా ఓటెయ్యాలి

ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా

భీమవరం క్రైం, ఏప్రిల్ 25 : నిబంధనలకు అనుగుణంగా పారదర్శకత, నిష్పక్షపాతంతో ఎన్నికల విధులు నిర్వహించాలని స్పెషల్ జనరల్ ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా పోలీస్‌శాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలను కొనియాడారు. జిల్లాలో చేపట్టిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావల్సి వస్తుందని హెచ్చరించారు. ఈవీఎంల రవాణా, భద్రతా విషయాలు, సిబ్బందికి సదుపాయాలు, ఇతర విషయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, డీఎస్పీలు మూర్తి, నారాయణస్వామిరెడ్డి, శ్రీనివాసరావు, పశ్చిమ గోదావరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, సెబ్ డీఎస్పీ వెంకట నారాయణ, దిశా డీఎస్పీ నున్న మురళీకృష్ణ, సీసీఎస్ యుగంధర్‌బాబు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ తిలక్, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పరకాల ప్రభాకర్

ఆలోచించి ఓటు వెయ్యండి

'సంక్షోభంలో రాజ్యాంగం, ఆర్థిక, రాజకీయ మూలాలు' సదస్సులో పరకాల

తణుకు, ఏప్రిల్ 25 : దేశంలో ప్రజా జీవనాన్ని, ప్రజాస్వామ్యాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన మోదీ నిర్వాకాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తతో, ఆలోచించి ఓటు వేయాలని ప్రముఖ రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. 'సంక్షోభంలో రాజ్యాంగం, ఆర్థిక, రాజకీయ మూలాలు' అనే అంశంపై తణుకులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'దేశంలో నిరుద్యోగం ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో పెరిగింది. విద్యావంతుల్లో నిరుద్యోగిత 83 శాతం ఉంది. 35 వేల రైల్వే ఉద్యోగాల కోసం కోటీ 30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. భారతీయ నిరుద్యోగులు ప్రాణాలకు తెగించి ఇజ్రాయిల్, ఉక్రెయిన్ దేశాలలో జరుగుతున్న యుద్ధాలలో ఉద్యోగులుగా వెళ్ళడానికి సిద్ధపడుతున్నారు. అయినా ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. పెరిగే ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. మూడు నెలల్లో కిరాణా సరుకుల బిల్లు చూస్తే మనకు తెలిసిపోతుంది. పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరల భారం అందరికీ అనుభవంలో వున్నదే. అన్నదాతలకు నోటితో రెట్టింపు ఆదాయమంటూనే వారి శాంతియుత ఆందోళనలపై కర్కశంగా వ్యవహరించింది. ప్రజాస్వామ్య విలువలైన రాజ్యాంగ నిబద్ధత, ప్రశ్నించే పౌరస్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛలకు తిలోదకాలిచ్చారు' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ గోదావరి జిల్లాల కార్యదర్శి కామన మునుస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో, దారి దీపం పత్రిక ప్రధాన సంపాదకులు డీవీవీఎస్ వర్మ, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవ స్థాపక అధ్యక్షుడు మురళికుమార్ మాట్లాడారు. వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు,ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫ్లాష్ బ్యాక్

ప్రసిద్ధి గాంచిన పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, మహానందీశ్వర స్వామి, పాపికొండల పేరంటాలపల్లి శివక్షేత్రం, గండి పోశమ్మ ఆలయం ఇతర ప్రసిద్ధి గాంచిన ఆధ్మాత్మిక దేవాలయాల కొలువు ఆధ్యాత్మికత ప్రపంచానికి నెలవు పోలవరం. అంతేకాదు ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే ప్రపంచలోనే రెండవ భారీ జాతీయ ప్రాజెక్టు , పాపికొండల నడుమ వయ్యారంగా వంపులు తిరిగి నడిచొస్తున్న పల్లెపడుచులా గోదావరి, సహజ సిద్ధ ప్రకృతి వనాల కనువిందు పర్యాటకుల మనసుల్ని కట్టిపడేసే సౌందర్యం పోలవరం సొంతం. ఈ ప్రాంతంలో వరి, మొక్కజొన్న, అరటి, పత్తి, అపరాల పంటలు పండిస్తారు. పోలవరం ప్రాజెక్టులో గత ప్రభుత్వ పాలనలో సుమారు 6 వేల మంది కార్మికులకు ఉపాధి లభించింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత 1985లో తొలిసారి టీడీపీ అభ్యర్థి మొడియం లక్ష్మణరావు నియోజకవర్గంలో టీడీపీ విజయకేతనం ఎగురవేసి 40,723 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989 లో బాడిస దుర్గారావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. ఆ తర్వాత టీడీపీ తరపున 1994 లో పూనెం సింగన్నదొర, 1999లో వంకా శ్రీనివాసరావు, 2014లో మొడియం శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1972 నుండి 2019 వరకూ జరిగిన 11 ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా టీడీపీ నాలుగుసార్లు, జాతీయ కాంగ్రెస్ 5 సార్లు. ఒకసారి ఇండిపెండెంట్ గెలుపొందారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల విభజన అనంతరం పోలవరం ఏలూరు జిల్లాకు మారుమూల గ్రామంగా మారింది. టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత ప్రాజెక్టు ఎగువ గ్రామాలను ఇతర జిల్లాలకు, మండలాలకు తరలింపు, పంచాయతీల విలీనం వలన కొంత మేర బలహీన పడినా స్థానిక టీడీపీ నేతల కృషితో మళ్ళీ బలం పుంజుకుంది.

పోలవరం నియోజకవర్గం ఏలూరు జిల్లాలో ఉంది. నియోజకవర్గంలో పోలవరం, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, బుట్టాయిగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి ఏడు మండలాలున్నాయి. వీటిలో రాష్ట్ర విభజనలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఏలూరు జిల్లాలో కొత్తగా కలిశాయి.

నాటి ప్రోలవరమే నేటి పోలవరం


పోలవరం గ్రామం ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడేనికి 55 కిలోమీటర్ల దూరంలో గోదావరి తీరాన ఉంది. పోలరాజులు పరిపాలించిన కారణంగా పోలవరంగా పిలవబడేది కాలక్రమేణా పోలవరంగా మారింది. ఈ ప్రాంతం ముసునూరు నాయకులు ఆధీనంలో ఉండేది. ముసునూరి పోలయ్య 1330లో పోలవరం గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం చేశారు. పాపికొండలు, పోలవరం ప్రాజెక్టు పోశమ్మగండి, పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, మహానందీశ్వరస్వామి, పేరంటాలపల్లి శివక్షేత్రం పోలవరం మండలంలో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1955 సంవత్సరంలో పోలవరం, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి మండలాలతో జనరల్ నియోజకవర్గంగా ఏర్పడింది.

1967లో ఎస్టీ నియోజకవర్గంగా మార్పు

1955 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో భారతీయ జాతీయ కాంగ్రెస్ పార్టీ నుండి పుసులూరి కోదండరామయ్య భారతీయ కమ్యూనిస్టు పార్టీకి చెందిన సంకు అప్పారావు మీద విజయం సాధించి మొదటి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 1962 సంవత్సరంలో కరాటం బాబూరావు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జనరల్ నియోజకవర్గంగా ఉన్న పోలవరం 1967లో షెడ్యూల్ తెగల ఎస్టీ నియోజకవర్గంగా మార్పు చెందింది. షెడ్యూలు తెగల నియోజకవర్గంగా మారిన తర్వాత మొట్ట మొదటి ఎమ్మెల్యే కెఆర్ రెడ్డి. 1955 నుంచి 2009 వరకూ నాలుగు మండలాలతో ఉన్న నియోజకవర్గంలోకి తీగల నరసాపురం మండలాన్ని చేర్చారు.

జిల్లాలోనే అతిపెద్ద రిజర్వుడు నియోజకవర్గం. ఐదు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గంలో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు కలవడంతో అతి పెద్ద నియోజక వర్గంగా మారింది. ఎక్కడో మారుమూలన ఉండే ఈ నియోజకవర్గంలో పోలవరం ప్రాజెక్ట్ రావడంతో జాతీయంగా ఎంతో పేరుప్రఖ్యాతలు వచ్చాయి. అటవీ ప్రాంతం, కొండలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం. ఏజెన్సీ ప్రాంతం కావడంతో నియోజకవర్గ పరిధిలో బుట్టాయిగూడెం మండలం కోట రామచంద్రపురంలో ఐటీడీఏను ఏర్పాటు చేశారు.

- పోలవరం



ఎవరికి పోలవరం

అతిపెద్ద రిజర్వుడు నియోజకవర్గం

గోదావరి అందాలు సొంతం

పోలవరం ప్రాజెక్టుతో ప్రపంచ ఖ్యాతి

ఆవిర్భావం నుంచి టీడీపీ కంచుకోట

నియోజకవర్గం	పోలవరం
మొత్తం ఓటర్లు	2,52,592
పురుషులు	1,22,201
మహిళలు	1,33,380
ఇతరులు	11

ఆహ్లాదాన్ని పంచే పాపికొండలు

పర్యాటకులకు ఆహ్లాదం, మానసిక ఉల్లాసాన్ని కలిగించే పాపికొండలు ఇక్కడే ఉన్నాయి. గోదావరి నదిపై కలల అలలపై తేలియాడుతూ బోటు ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎత్తైన పాపికొండలు వాటి నడుమ మెలికలు తిరిగి ప్రవహిస్తున్న గోదావరి, నదికి ఇరువైపులా పచ్చని తీవాచీ పరిచినట్లుండే ప్రకృతి వనాలు. పాపికొండల జాతీయ పార్కులో స్వేచ్ఛగా సంచరించే వన్యమృగాలు వీట న్నింటిని స్వయంగా వీక్షించి అనుభూతి పొందితే చాలు అని ప్రతి రోజు పర్యాటకులు పోలవరం వచ్చి పాపికొండల విహార యాత్రకు వెళుతుంటారు.



సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1955	పసులూరి కోదండరామయ్య	కాంగ్రెసు	సంకు అప్పారావు	సీపీఐ	492
1962	కరాటం బాబూరావు	సీపీఐ	పోతన అప్పారావు	కాంగ్రెసు	1874
1967	కొండమొదల రామిరెడి	కాంగ్రెసు	ఎ.సంకురుడు	సీపీఐ	13,544
1972	కణితి రాములు	కాంగ్రెసు	తెల్లం బొజ్జిదొర	జనత	27,136
1978	రసపుత్ర నాగభూషణం	కాంగ్రెసు(ఐ)	మొడియం లక్ష్మణరావు	జనత	24,399
1983	మొడియం లక్ష్మణరావు	ఇండిపెండెంట్	పూనెం సింగన్నదొర	కాంగ్రెసు	9617
1985	మొడియం లక్ష్మణరావ	టీడీపీ	ఆర్.లక్ష్మీనారాయణ	కాంగ్రెసు	16,128
1987	బాడిస దుర్గారావు	కాంగ్రెసు	పూనెం సింగన్నదొర	టీడీపీ	4,324
1989	బాడిస దుర్గారావు	కాంగ్రెసు	తెల్లం చిన్నవడ్డీ	టీడీపీ	2,814
1994	పూనెం సింగన్నదొర	టీడీపీ	బాడిస దుర్గారావు	కాంగ్రెసు	32,198
1999	వంకా శ్రీనివాసరావు	టీడీపీ	బాడిస దుర్గారావు	కాంగ్రెసు	24
2004	తెల్లం బాలరాజు	కాంగ్రెసు	సున్నం బుజ్జి	టీడీపీ	18,842
2009	తెల్లం బాలరాజు	కాంగ్రెసు	పూనెం సింగన్నదొర	టీడీపీ	5,664
2014	మొడియం శ్రీనివాసరావు	టీడీపీ	తెల్లం బాలరాజు	వైసీపీ	15,720
2019	తెల్లం బాలరాజు	వైసీపీ	మొడియం శ్రీనివాసరావు	టీడీపీ	42,070

మణిహారం..పోలవరం ప్రాజెక్టు

పోలవరానికి మణిహారం పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పోలవం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఎంతో మంది కార్మికులు ఉపాధి పొందారు. ప్రపంచంలో నిర్మితమైన అతి భారీ ప్రాజెక్టులలో రెండవదిగా పేరుగాంచింది. అతి తక్కువ వ్యవధిలో కాంక్రీట్ నిర్మాణం చేసినందుకు రెండు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కింది. కుడి కాలువ ద్వారా కృష్ణా అనుసంధానం జరిగి రాయలసీమ వరకూ సాగునీరు తాగునీరు అందించి లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చింది. ఎడమ కాలువ ద్వారా విశాఖపట్టణ పరిశ్రమలకు సాగు తాగునీటి సరఫరా చేయనుంది. రాష్ట్రానికి విద్యుత్ సమస్య తీర్చేందుకు 960 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసే పవర్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉంది. పోలవరం ప్రాజెక్టు ప్రపంచ పర్యాటకులకు రానున్న రోజుల్లో అత్యద్భు కట్టడంగా కనువిందు చేయనుంది.

ప్రసిద్ధ శైవక్షేత్రాలకు నిలయం

పోలవరం పేరు చెబితే ఆధ్యాత్మికతకు నెలవుగా వేరే చెప్పనవసరం లేదు. గోదావరి నది మధ్యలో స్వయంభువుగా వెలసిన పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం, పోలవరం ప్రాజెక్టు దిగువ కాపర్ డ్యాం సమీపంలో ఉండే మహానందీశ్వరస్వామి ఆలయం, ఎగువ కాపర్ డ్యాంకి సమీపంలో ఉండే గండి పోశమ్మ ఆలయం, పాపికొండల సమీపంలో పేరంటాలపల్లి శివక్షేత్రం చెప్పకోదగ్గ ఆధ్యాత్మిక కేంద్రాలు. రాష్ట్రంలో నలుమూలల నుంచి ఏటా 5 లక్షల మందికి పైగా భక్తులు మహాశివరాత్రి సందర్భాల్లో పట్టిసీమ శివక్షేత్రాన్ని దర్శించుకుంటారు. గండి పోశమ్మ ఆలయానికి నిత్యం భక్తులు ఉభయ గోదావరి జిల్లాల నుంచి మొక్కు బడులు తీర్చుకుంటారు. పట్టిసీమ నుంచి పాపికొండల వరకూ గోదావరి నదికి ఇరువైపులా ప్రతిచోటా శివలింగాలు దర్శనమిస్తాయి.



ప్రచార సిత్రం..



ప్రచారంలో పిల్లల సందడి

ఏ కార్యక్రమంలో అయిన పిల్లలు పాల్గొంటే ఆ సరదాయే వేరు. ప్రస్తుతం పిల్లలకు వేసవి సెలవులు ఇచ్చారు. ఇప్పుడసలే ఎలక్షన్ సీజన్.. ప్రచారం హోరెత్తుతోంది. ఇంకేముంది.. పిల్లలకు బోల్డంత ఆటవిడుపు దొరికింది. వేసవి గ్రామాల్లో వివిధ పార్టీల ప్రచారంలో జెండాలు గుర్తులు పట్టుకుని సందడి చేస్తున్నారు. తమ తల్లిదండ్రులు ఏపార్టీ వారన్నదానితో సంబంధం లేకుండా తమకు నచ్చిన పార్టీ వైపు తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారు. పిల్లలు తోడవడంతో పెద్దల్లో ఉత్సాహం మరింత పెరుగుతోంది. గురువారం తీపర్రులో జరిగిన ప్రచారంలో పిల్లలు ఇలా జెండాలు పట్టుకున్నారు.

- పెరవలి

చింతలపూడి టీడీపీ అభ్యర్థికి లీగల్ నోటీసు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 : ఏలూరు జిల్లా చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ నామినేషన్ పత్రాల్లో వాస్తవాలను దాచిపెట్టి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయన నామినేషన్ తిరస్కరించాలని లీగల్ నోటీసు పంపించారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా, ఎన్నికల అధికారులకు లింగపాలెం మండలం జీలకర్రగూడెంనకు చెందిన రిటైర్డ్ ఎంఈవో ధర్మరాజు తన న్యాయవాది జి.రొనాల్డ్‌రాజ్‌తో గురువారం నోటీవు పంపించారు. రోషన్‌కుమార్ అమెరికాలో తన భార్యతో పాటు ఉద్యోగం చేస్తూ గ్రీన్‌కార్డు పొందారని ఆయనకు అక్కడ బ్యాంక్ ఖాతా, ఆస్తులు, అప్పులు, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ కాంటాక్టు వివరాలు, వీసా, బ్యాంకు డిపాజిట్లు వంటి వివరాలను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదని ఉద్దేశ్యపూర్వకంగానే ఆయన ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, ఎన్‌ఆర్‌ఐలు ఇక్కడ ఓటర్ల జాబితాలో నమోదు అవ్వాలంటే 6ఎ ఫారమ్ కింద పేరు నమోదు చేయించుకోవాలని ఎన్నికల నిబంధనలు అతిక్రమించారని ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని లీగల్ నోటీసులో పేర్కొన్నారు

ఒకే పేరుతో నామినేషన్లు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 25: వైసీపీ కుట్ర రాజకీయాలకు తెర తీసింది. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థికి ఓట్లు వేసేవారిని గందరగోళంలో పడేసేందుకు అస్త్రాలను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్‌లు సమర్పించారు. అభ్యర్థుల పేర్లు ఉన్నవారితో నామినేషన్లు వేయిస్తోందని ఇది అధికార పార్టీ వైసీపీ కుట్రలో భాగమేనని పలువురు విమర్శిస్తున్నారు. గురువారం భారీగా తాడేపల్లిగూడెంలో 16 నామినేషన్‌లు సమర్పించారు. జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్న బొలిశెట్టి శ్రీనివాస్ పేరును పోలిన అభ్యర్థి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున బొలిశెట్టి శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అదేవిధంగా జనసేన పార్టీ పేరును పోలిన ఉంగుటూరు జాతీయ జనసేన పార్టీ తరపున అభ్యర్థిగా బూసనబోయిన ఆంజనేయులు నామినేషన్ దాఖలు చేశారు.

నరసాపురంలో ముగ్గురు నాయకర్‌లు

నరసాపురం : నరసాపురం అసెంబ్లీ స్థానానికి మొత్తం 14 మంది అభ్యర్థులు 25 సెట్ల నామినేషన్లు వేశారు. వీరిలో నాయకర్‌ల పేర్లపై ముగ్గురు అభ్యర్థులు ఉన్నారు. జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో పాటు జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పాలెపు సత్యలింగ నాయకర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొల్లి సత్య నాయకర్‌లు ఉన్నారు. వీరిలో పాలెపు సత్యనాయకర్ స్వస్థలం కాకినాడ పట్టణం కాగా, కొల్లి సత్యనాయకర్ స్వస్థలం నరసాపురం పట్టణంలోని 3వ వార్డుకి చెందిన వాడుగా నామినేషన్ పత్రంలో చూపించారు. బ్యాలెట్‌లో ముగ్గురు నాయకర్ పేర్లు ఉంటే ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వీరి పార్టీలు, గుర్తులు వేరైనా పేర్లు కారణంగా కన్ఫ్యూజ్ అయ్యే అవకాశం ఉంది. కావాలనే ఏవరైనా వీరితో నామినేషన్లు వేయించారా ? అని పలువరు చర్చించుకుంటున్నారు.

ముగ్గురు ధర్మరాజులు,ఇద్దరు వాసుబాబులు

ఉంగుటూరు : ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వేసిన నామినేషన్లలో రెండు విచిత్రాలు చోటు చేసుకున్నాయి. జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తన నాలుగు సెట్ల నామినేషన్లను దరఖాస్తు చేయగా మరో వ్యక్తి పెదపూడి ధర్మరాజు జాతీయ జనసేన పార్టీ తరఫున దరఖాస్తు చేశారు. నవరంగ్ కాంగ్రెస్ తరఫున పొట్ల ధర్మరాజు కూడా దరఖాస్తు చేశారు. వైసీపీ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు తన మూడో సెట్ నామినేషన్‌ను దరఖాస్తు చేయగా అదేపేరు ఉన్న కైకరం గ్రామానికి చెందిన పుప్పాల శ్రీనివాసరావు కూడా దరఖాస్తు చేయడం విశేషం.



నిడదవోలు బరిలో నలుగురు 'ప్రసాద్'లు

పెరవలి : నిడదవోలు అసెంబ్లీ స్థానానికి నామినేషన్‌ల ఘట్టం గురువారంతో ముగిసింది. అయితే నామినేషన్‌ల పరిశీలన ఉపసంహరణ అనంతరం ఎంత మంది పోటీలో ఉంటారనేది వేచి చూడాలి. అయితే ఈ నాలుగు రోజులుగా నామినేషన్‌లు వేసినవారిలో ప్రసాద్ పేరు గల వారు నలుగురు ఉండటం విశేషం. వీరిలో ప్రధానంగా జనసేన తరుపున కందుల లక్ష్మి దుర్గేష్ ప్రసాద్ నామినేషన్ వేయగా పిరమిడ్ పార్టీ తరుపున ముక్కామల అన్నవర ప్రసాద్ నామినేషన్ వేశారు. ఇండియన్ పార్వర్డ్ బ్లాక్ పార్టీ తరుపున కస్తూరి సత్య ప్రసాద్ నామినేషన్ వేశారు. ఇండిపెండెంట్‌గా అరిగెల సత్య వరప్రసాద్ నామినేసన్ వేశారు. మొత్తం నామినేషన్‌లు వేసిన వారిలో ప్రసాద్ పేరుతో ఉన్నవారు నలుగురు ఉన్నారు.

తెలుసుకుందాం..



డిపాజిట్ గల్లంతంటే..?

ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులకు డిపాజిట్లు దక్కవని ప్రసంగాల్లో వింటుంటాం.. పోటీలో ఉన్న తమ పార్టీ అభ్యర్థుల్ని గెలిపించేందుకు కేడర్‌ను ఉత్తేజపరుస్తూ ఈ విధంగా ప్రసంగి స్తుంటారు. కొంతమంది చర్చించుకున్నప్పుడు కూడా ఈ పదాన్ని వాడుతుంటారు. అసలు డిపాజిట్ గల్లంతంటే ఏమిటి.? ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రతి అభ్యర్థి కొంత మొత్తాన్ని నామినేషన్ దాఖలు చేసే సమయంలో డిపాజిట్ కడుతుంటారు. అసెంబ్లీకి అయితే ఓసీ అభ్యర్థి రూ.10 వేలు, అదే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్‌గా చెల్లించాలి. పార్లమెంట్ స్థానానికి ఆయితే జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అయితే రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత వచ్చిన ఓట్లు బట్టి ఈ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తారు. ఆ సమయంలో మొత్తం పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు (16.5 శాతం) ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇచ్చేస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించిన వారికి డిపాజిట్ సొమ్ము ఇవ్వరు. దీన్నే డిపాజిట్ గల్లంతంటారు.

-నరసాపురం

ఎట్టెట్టా..!

అయిన వాళ్లకే మళ్లీ కండువాలు



వేసిన వాళ్లకే మళ్లీ మళ్లీ కండువాలు వేస్తున్నారు.. రండి రండి అంటూ పార్టీలోకి కొత్తగా ఆహ్వానిస్తున్నారు. మా పార్టీలో ఇంత మందిని చేర్చుకున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. సార్ వాళ్ళందరూ మీ వాళ్లేగా.. ఎందుకు లేనిపోని హడావుడి అని తెలిసిన వారు అంటే నవ్వి ఊరుకుంటున్నారు. ఇది తాజాగా వైసీపీలో జరుగుతున్న తంతు ఇప్పటి వరకు కార్యకర్తల వెనుక ఉన్న వైసీపీ సానుభూతిపరులను ముందుకు తీసుకువచ్చి పార్టీల్లో చేర్చుతు న్నట్టుగా కండువాలు కప్పుతున్నారు. వేరే పార్టీవారు చేరారంటూ ప్రచారం చేస్తున్నారు. తర్వాత ఓటర్లు దగ్గర నాయకులు నవ్వుల పాలవుతున్నారు. ఇటీవల భీమవరం మండలంలో జనసేన వార్డు సభ్యురాలికి వైసీపీ సమావేశంలో వైసీపీ కండవా వేశారు.. తరువాత ఆమె జనసేన ప్రచారంలో పాల్గొంది. దీంతో పార్టీ చేరికలు ప్రచా రానికే గానీ నిజంగా కావంటూ కొందరు గుసగుసలాడుకుంటున్నారు. - భీమవరం రూరల్

ఇదీ సంగతి !



ఎన్నికలొస్తే అతను బిజీ !

కూలి డబ్బులతో నామినేషన్



సికిలి రత్నరాజు

ఆచంట, ఏప్రిల్ 25: ఎన్నికల షెడ్యూల్ వచ్చిందంటే అతడు ఎన్నికల కార్యాలయాల వద్ద ప్రత్యక్ష్యమవుతాడు. నలుగురిని వెంటబెట్టుకుని వచ్చి నామినేషన్ వేస్తాడు. నామినేషన్ వేసిన రోజునే నేనే ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజక వర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని, దేశంలోనే నెంబర్-1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా అంటూ మాటలతో అందరినీ నవ్విస్తాడు. ప్రతీ ఎన్నికల్లో ఆచంట నుంచి నామినేషన్ వేస్తుంటాడు.. ఎవరతను ? ఏమిటా కథ ?.. యలమంచిలి మండలం నేరేడుమిల్లికి చెందిన సికిలి రత్నరాజు కూలి పనులు చేసుకుని జీవిస్తాడు. రత్నరాజు ఐదు సంవత్సరాలకు ఒక్కసారి ఆచంటలో ప్రత్యక్షమై నామినేషన్ వేస్తాడు. గురువారం ఆచంటలో నామినేషన్ వేశాడు. తన నియోజకవర్గం పాలకొల్లు అయినప్పటికి ఆచంటలోనే ప్రతీ సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ వేయడం ఆశ్చర్యం. 2009, 2014, 2019 ఎన్నికలతో పాటు ఈ సారి కూడా నామినేషన్ వేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. షెడ్యూలు వచ్చిన వెంటనే నామినేసన్ వేసేందుకు పది వేలు సంపాదించుకుని నామినేషన్ వేస్తాడు. గతంలో నరసాపురంలో కూడా ఒకసారి నామినేషన్ వేయడం జరిగింది. దీంతో సికిలే రత్నరాజు అందరికీ సుపరిచితుడయ్యాడు. నామినేషన్ వేసిన తరువాత వారం రోజులపాటు తనకు తెలిసిన గ్రామాల్లో ఒక్కడే తన సైకిల్‌పై తిరుగుతు ప్రచారం చేసుకుంటాడు..

ప్రచారంలో ముదునూరి తనయుడి ఎదురీత..

నరసాపురం రూరల్, ఏప్రిల్ 25: వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని తనయుడు కృష్ణంరాజు గురువారం పెదసారవ గ్రామంలో వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెళ్లిన ప్రతి ఇంటి నుంచి తాగునీటి సమస్యలపై నిలదీశారు. వందల వందలు ఖర్చు చేసి టిన్నులు తెచ్చుకుంటున్నామని చెప్పి ఇంటికి వచ్చిన నాయకులపై మండిపడ్డారు.దీంతో అవాక్కయిన తనయుడు మళ్లీ ఆధికారం మాకు ఇవ్వండి...మీ గ్రామంలో ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యలు తీరుస్తామని సర్దు చెప్పే ప్రయత్నం చేశారు. వెళ్లిన ప్రతి గుమ్మంలో నుంచి నీటి సమస్యలపైనే గళం విప్పడం గమనార్హం.



ఏలూరు 50వ డివిజన్‌లో పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన బడేటి చంటి

కూటమి విజయానికి వలసలే నిదర్శనం

▸▸ ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 25: రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందనడానికి పార్టీలోకి రోజురోజుకు వస్తున్న వలసలే నిదర్శనమని ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి తెలిపారు. స్థానిక ఐదో డివిజన్‌లో 'బాబును మళ్లీ రప్పిందాం' కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా టీడీపీలోకి చేరికలు ఊపందుకున్నాయన్నారు. ఎన్నికల సమరభేరీ మోగినప్పటి నుంచి వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి వస్తూనే ఉన్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్లనాని విధానాలు నచ్చక వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నారని అన్నారు. 50వ డివిజన్ నుంచి మాజీ కౌన్సిలర్ చింతా దుర్గారెడ్డి ఆధ్వర్యంలో చింతా మహేష్, జగ్గి శ్రీనివాస్, కప్పా శ్రీనివాసరావులతో పాటు సుమారు వంద మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తనను నమ్మి పార్టీలోకి వచ్చిన వారందరికి భవిష్యత్తుల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి రుణం తీర్చుకునేందుకు టీడీపీలోకి నిస్వార్థంగా ప్రజలు వస్తున్నారని అన్నారు. ఎన్నికలకు ముందే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం ఖయమైందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ అమరావతి అశోక్, పర్సా ప్రసాద్, కంపా విటల్, రెడ్డి ఈశ్వరరావు, గంగాధరరావు, పాల్గొన్నారు.



పూళ్ళలో ఓట్లు అభ్యర్థిస్తున్న గన్ని, పత్సమట్ల, వట్టి పవన్

రాష్ట్ర శ్రేయస్సు కోసం జగన్‌రెడ్డిని ఓడించాలి

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని, ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల

భీమడోలు, ఏప్రిల్ 25 :రాష్ట్ర శ్రేయస్సు కోసం జగన్‌రెడ్డిని సమష్టిగా ఓడించాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పూళ్ళ గ్రామంలో గురువారం 'జనంలోకి ధర్మరాజు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పత్సమట్ల ధర్మరాజుతో పాటు గన్ని వీరాంజనేయులు, వట్టి పవన్ తదితరులు ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. కూటమి పథకాలను ప్రజలకు వివరించారు. ధర్మరాజు, గన్ని మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాన్ని కాపాడాలంటే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలపాలంటే కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా అధికారంలోకి రావాలన్నారు. ఉమ్మడి అభ్యర్థి ధర్మరాజు గుర్తు గాజు గ్లాసుకు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ గుర్తు సైకిల్ గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

వేసవిలో ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 : వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రత్యేక రైలును సికింద్రాబాద్ నుంచి సత్రగంజి వరకు, సత్రగంజి నుంచి సికింద్రాబాద్ వరకు ఈనెల 28 నుంచి జూలై 2వ తేదీ వరకూ నడుపనున్నట్టు ఓ ప్రకటనలో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. రైల్ నెంబర్ 07234 సికింద్రాబాద్‌లో అర్ధరాత్రి 23.40 గంటలకు ప్రతి ఆదివారం బయలుదేరుతుంది. ఈ రైలు ఏలూరుకు ఉదయం 7 గంటలకు వచ్చి 7.02 నిమిషాలకు బయలుదేరి సత్రగంజి వైపు వెళ్తుంది. రైల్ నంబరు 07235 సత్రగంజి నుంచి సికింద్రాబాద్‌కు ప్రతి మంగళవారం సత్రగంజిలో మధ్యాహ్నం 12.20 నిమిషాలకు బయలుదేరుతుంది. ఈ రైలు ఏలూరుకు ఉదయం 7.45 నిమిషాలకు వచ్చి బయలుదేరుతుంది. జిల్లాలోని ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ రైలు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపూర్, కుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, బాద్రాక్, బాలాషోర్, కరక్‌పూర్, సత్రగంజి రైల్వే స్టేషన్లలో ఆగుతుంది.

పశుసంవర్ధక శాఖకు స్టేట్ మూడో ర్యాంకు



అవార్డు అందుకుంటున్న నెహ్రూబాబు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 25: ఈ ఏడాది ఉత్తమ పురోగతి సాధించిన జిల్లా పశుసంవర్ధక శాఖకు రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు లభించింది. పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ జి.నెహ్రూబాబుకు ఆ శాఖ డైరెక్టర్ అమరేంద్ర విజయవాడలో గురువారం అవార్డు అందజేశారు. నెహ్రూబాబు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమష్టి కృషితోనే అవార్డు సాధ్యమైందన్నారు.

చదువుపై శ్రద్ధ పెంచుకోవాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 25: విద్యార్థులుగా ఉన్నప్పుడు చదువుకోసం ఎక్కువ సమయం కేటాయించాలని కేవలం మార్కుల ఆధారంగా మాత్రమే మంచి భవిష్యత్తు ఉండదని నెహ్రూయువ కేంద్రం యూత్ అధికారి దూలం కిషోర్ అన్నారు. కంప్యూటర్ శిక్షణ పొందుతున్న టెన్త్, ఇంటర్‌పాసైన విద్యార్థులకు గురువారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై 30మందికి బహుమతులు అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఇంజ నీరింగ్ విభాగం డీఈ టి.కొండలరావు, కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, దువ్వి హేమసుందర్, కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

వాయిస్ కాల్స్‌తో గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 : గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యం, జాగ్రత్తలు, ఆహార నియమాలు, వైద్యపరీక్షలు ప్రధాన పర్యవేక్షణ అంశాలుగా వైద్యఆరోగ్యశాఖ 'కిల్కారి వాయిస్ కాల్స్' పేరిట ఓ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వెల్లడించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో నూతన యాప్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. గర్భిణిగా వున్న సమయంలోనే స్థానిక సచివాలయ ఏఎన్ఎం మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేసుకుంటుందని, అక్కడినుంచి దశల వారీగా నిర్ణీత క్రమంలో 72 వాయిస్‌కాల్స్ గర్భిణి మొబైల్‌ఫోన్‌కు వస్తాయన్నారు. ఒక్కో కాల్ సమయం 30 సెకన్లు ఉంటుందని, గర్భిణులు, బాలింతలకు తలెత్తే ఎన్నో సందేహాలను ఈ వాయిస్ కాల్స్ వినడం ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఫోన్ ఎత్తడం మిస్ అయితే ఐవీఆర్ సిస్టం ద్వారా ఒకరోజులో మూడుసార్లు కాల్స్ వచ్చేలా డిజైన్ చేశారని తెలిపారు. మరోదఫా ఆ సందేశాన్ని వినాలంటే టోల్ ఫ్రీ నెంబరు 14423కు డయల్‌చేసి వినవచ్చన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌పీఎం రాజు, ప్రోగ్రాం ఆఫీసర్ మోహన్, డీపీఎస్‌వో జ్యోతి, డీసీఎంఎస్ వెంకట్, ఆశ నోడల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నూకాలమ్మ హుండీ ఆదాయం రూ.2.22 లక్షలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 25. దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని కొత్తపేటలోని నూకాలమ్మ గ్రామదేవత ఆలయ హుండీ ఆదాయం 72 రోజులకుగాను రూ.2,22,410 వచ్చిందని ఆలయ ఈవో నాగం సన్యాసిరావు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్ ఈవో కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. హుండీ లెక్కింపులో భక్తులు, సిబ్బంది,. దర్మకర్తలు పాల్గొన్నారు. తొలుత అ మ్మవారికి దేవాదాయ అధికారులుతో ఆలయ ప్రధాన అర్చకులు మంత్రవాది రామకృష్ణ ప్రత్యేక పూజలు జరిపించారు.

తాగునీటి కష్టాలు

- ▸▸ మండుతున్న ఎండలు
- ▸▸ విలీన గ్రామాల్లో సమస్య మరింత తీవ్రం
- ▸▸ నగరంలో పలుచోట్ల పైపులైన్ల లీకేజీతో కలుషిత నీరే దిక్కు
- ▸▸ ఓట్ల వేటలో పాలకులు.. జేబులు నింపుకుంటున్న అధికారులు !
- ▸▸ ఆందోళన చెందుతున్న ప్రజలు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 25 : ఎండలు మండుతున్నాయి. పురప్రజల గొంతులు తడారిపోతున్నాయి. పాలకులు ఓట్ల వేటలో పడ్డారు. అధికారులు జేబులు నింపుకోవడంలో నిమగ్నమయ్యారు. పురప్రజల తాగునీటి అవసరాలు తీర్చే నాథుడే కనిపించడం లేదు. నగరంలో పలుచోట్ల తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. వాటర్ పైపులేని చోట్ల ట్యాంకర్ల కోసం ప్రజలు ఎర్రటి అగ్గిలో ఎదురు చూస్తున్నారు. చాలా ప్రాంతాల్లో పైపుల లీకేజీ వల్ల డ్రెయిన్లలోని మురుగునీరు కలవడంతో రకరకాల రంగుల్లో కలుషిత తాగునీరు వస్తోంది. జాలిపూడి మురుగునీటి డ్రెయినేజీలో పైపులు లీకై తాగునీరు కలుషితమవుతోంది. మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో ట్యాంకర్లు రాక నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. విలీన గ్రామాల్లో బోర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో 1,100 గృహాలున్నాయి. వీరందరికి ఒక్కటే బోరు. ఈ బోరు తరచూ మరమ్మతులకు గురవడంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఎదురు చూసి చూసి కిలోమీటర్ల దూరంలో ఉన్న నీటి శుద్ధి కేంద్రాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. విలీన గ్రామాల్లోని చెరువుల నీటిని వాటర్ హెడ్ ట్యాంక్‌ల్లోకి ఇంతవరకు ఎక్కించక పోవడంతో రాబోయే రెండు నెలలు తాగునీటి కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. దెందులూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నెలరోజులకు సరిపడ తాగునీరు ఉంది. ఓ పక్క కృష్ణా, గోదావరి నదులు ఇంకిపోయాయి. మళ్లీ వీటిలోకి నీరు రావాలంటే వర్షాలు పడాల్సిందే. వర్షాలు మరో రెండు నెలల వరకు పడే అవకాశాలు లేవు. ఈ పరిస్థితుల్లో మరో నెలరోజుల పాటు తాగునీరు ఎక్కడ నుంచి తీసుకొస్తారో పాలకులకే తెలియాలి.

పైపులైన్ల లీకేజీతో వృథాగా నీరు..

పైపులైన్ల లీకేజీలతో చాలా నీరు వృథా అవుతోంది. తూతూమంత్రంగా లీకేజీలను సరిచేయడంతో అనంతరం యథాస్థితి నెలకొంటుంది. ప్రధానంగా టూటౌన్‌లో కలెక్టరేట్ వద్ద అన్న క్యాంటీన్ దగ్గర, ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో శాంతినగర్ క్రాస్‌రోడ్డు టీటీడీ కల్యాణ మండపం వద్ద, రామకృష్ణాపురం కాస్మొటిక్ క్లబ్, పంపుల చెరువు, సమీపంలో లీకేజీలు ఎప్పటి నుంచో ఉన్నప్పటికి వాటిని సరి చేయడంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కొందరు ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈలు వాటర్ ట్యాంకర్ల ద్వారా పలు ఫంక్షన్ హాళ్లకు, హోటళ్లకు తాగునీటిని అమ్ముకుంటూ సొమ్ములు చేసుకుంటున్నారు. కనీసం మానవత దృక్పథం లేకుండా జేబులు నింపుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. నల్లదిబ్బ ప్రాంతంలో పైపులీకేజీ వల్ల సుమారు నెల రోజుల పాటు రంగు మారిన నీళ్లు వచ్చాయి. నెలరోజుల తర్వాత ఏదో సరి చేశామన్నట్టు తూతూమంత్రంగా సమస్య పరిష్కరించలేకపోయారు.



తాగునీటి కోసం బిందెలతో ఎదురుచూస్తున్న మాదేపల్లి మహిళలు

జాలిపూడి డ్రెయిన్‌లో పైపు లీకేజి దృశ్యం

పట్టించుకోని క్షేత్రస్థాయి సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సుల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ అధికారులు ఎప్పుడూ తమ సీట్లలో కనిపించరు. అదేమని అడిగితే అవుట్‌డోర్‌లో ఉన్నారన్న సమాధానం వస్తుంది. ఈమధ్య ఎన్నికల డ్యూటీలు వేశారంటూ కొత్త కారణం చెబుతున్నారు. విలీన గ్రామాల ప్రజలకు పైపులైన్లు వేసి గోదావరి వాటర్ అందించాలని, పైపులైన్ల లీకేజీలు అరికట్టి కలుషిత నీరు రాకుండా చూడాలని, శివారు ప్రాంతాల్లో నిత్యం ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమికే ముస్లింల మద్దతు

▸▸ శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 25: రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ముస్లిం, మైనార్టీల మద్దతు ఉంటుందని శాసన మండలి మాజీ చైర్మన్ ఎండీ షరీఫ్ అన్నారు. ఏలూరు క్రిస్టల్ కల్యాణ మండపంలో ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ముస్లింలంతా టీడీపీ వైపే ఉన్నారన్నారు. ముస్లిం మద్దతుతోనే టీడీపీ ఎన్నోసార్లు గెలుపొంది రాష్ట్ర అభివృద్ధి సంక్షేమానికి కృషి చేసిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనను అంతమొందించేందుకు కూటమి ఏర్పడిందన్నారు. ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అనే సైకో సర్వనాశనం చేశాడన్నారు. మళ్లీ రాష్ట్రం గాడిలోపడాలంటే ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. టీడీపీ పరిశీలకులు కాశీ నవీన్‌కుమార్, మాజీ మంత్రి మరడాని రంగారావు, ఎంఆర్‌డీ బలరామ్, కొట్టు మనోజ్, నూర్‌భాష, సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం 19వ డివిజన్‌కు చెందిన నూర్‌భాష సంఘం జిల్లా కార్యదర్శి షేక్ మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో 150 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్



పెదవేగిలో చింతమనేని ప్రభాకర్ ప్రచారం

వైసీపీకి బుద్ధి చెప్పే సమయం ఇదే..

పెదవేగి/దెందులూరు, ఏప్రిల్ 25 :అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన వైసీపీకి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవారితో పాటు పలు ఆలయాల్లో పూజలు చేయించారు. పెదవేగి మండలం కె.కన్నాపురం, తాళ్ళగోకవరం, వేగివాడ గ్రామాల్లో దెందులూరు మండలం శ్రీరామవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న చిర్రి బాలరాజు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : చిర్రి

కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని పోలవరం కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేయడానికి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం పట్టణంలో ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, గంటా మురళి, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'దోమల నిర్మూలనకు ప్రజల సహకారమే కీలకం'

● ఏలూరు ఎడ్యుకేషన్ : సమాజానికి పెనుముప్పుగా పరిణమించిన దోమల నిర్మూలనకు ప్రజల సహకారమే కీలకమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.శర్మిష్ట పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం పురస్కరించుకుని ఏలూరులో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఒకరినుంచి మరొకరికి సోకే మలేరియా జ్వరాల కేసులు గతేడాది ఏలూరు జిల్లాలో 40 నమోదుకాగా, ఈ ఏడాది తొలి నాలుగు నెలల కాలంలో 13 మాత్రమే నమోదయ్యాయన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి మాట్లాడుతూ దోమల నిర్మూలనకు చేపడుతున్న కార్యాచరణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా సిబ్బంది అమలు చేస్తున్నారని వివరించారు. ర్యాలీలో డీపీహెచ్‌ఎన్‌వో జ్యోతి, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు, డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు రవికుమార్, శ్రీనివాస్, రమేష్, దుర్గారావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం, : మన్యం ప్రజలను పట్టిపీడిస్తున్న మలేరియా మహమ్మారి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుని మలేరియాలేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని కేఆర్‌పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినంలో భాగంగా గురువారం కేఆర్‌పురం పీహెచ్‌సీ పరిధిలో జరిగిన మలేరియా నివారణ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ పరిస్థితుల దృష్ట్యా ఇక్కడ మలేరియా కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని ప్రజల్లో అవగాహన కల్పించడం, చైతన్యవంతులను చేయడం ద్వారా మలేరియాను నివారించవచ్చన్నారు. ఏజెన్సీలో మలేరియా నివారణకు తీసుకుంటున్న చర్యలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు మేరీ కాథరిన్, ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి డాక్టరు జలగం సురేష్‌కుమార్ వివరించారు. వైద్యాధికారులు డాక్టరు మౌనిక, డాక్టరు వసుంధర, డాక్టరు సుధీర్, డాక్టరు నాగేశ్వరరావు, డాక్టరు ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా అర్బన్ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కె.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో చింతలపూడిలో ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ సెంటర్లో మానవహారంగా ఏర్పడి, సమాజం నుంచి మలేరియా తరిమేయాలంటే అది మనచేతుల్లో ఉందన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్.ఏ ప్రసాద్, జప్రుల్లా, బాలరాజు, శ్రీనివాసరావు, విజయనిర్మల పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో, మున్సిపల్ హెల్తాఫీసర్ తదితరులు

● లింగపాలెం : దోమలను నిర్మూలనతో మలేరియాను అంతం చేయవచ్చని కె.గోకవరం వైద్యాధికారిణి ఎమ్డీ అబీదా అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డ్రైడేని పాటించటం, దోమల తెరలు వాడటం ద్వారా దోమకాటు నుంచి తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్, సూపర్‌వైజర్ ఉమా మహేశ్వరరావు, నాగేంద్ర, అనురాధ, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● టి.నరసాపురం : మలేరియా జ్వరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని డాక్టర్ షేక్ ఇమాంబి అన్నారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా బొర్రంపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారిని డాక్టర్ షేక్ ఇమాంబి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరాల నివారణకు వైద్య శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. దోమతెరల పంపిణీ, మురికినీరు నిల్వ ఉండకుండా పలు జాగ్రత్తలతో ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. ఎంపీహెచ్‌వో బి.ఏడుకొండలు, హెల్త్ సూపర్‌వైజర్ సుభాన్‌బేగ్, హెల్త్ అసిస్టెంట్ గుళ్ల మహాలక్ష్మయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు సీహెచ్ గిరీష్, ఈశ్వరి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం వార్తలు

చికిత్స పొందుతూ టెన్త్ విద్యార్థిని మృతి



హనీ మృతదేహం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మూడు సబ్జెక్టులు ఫెయిలయ్యానని తీవ్ర మనస్తాపంతో అధిక మోతాదులో మాత్రలను వేసుకుని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని ఏసుపాదపురానికి చెందిన రామనోళ్ళ శివయ్య, రత్నం దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివయ్య హైదరాబాద్‌లో టైలరింగ్ చేస్తూ వారం వారం ఇంటికి వస్తూ ఉంటాడు. రత్నం ఏలూరులోని ఒక షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. వారి కుమారుడు మనీష్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కుమార్తె హనీ (16) పదో తరగతి గత ఏడాది ఫెయిలై.. ప్రస్తుతం పబ్లిక్ పరీక్షలు రాసింది. ఈ ఫలితాలు రెండు రోజుల క్రితం రావడంతో ఆ బాలిక తెలుగు, లెక్కలు, సోషల్ మళ్ళీ ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపానికి గురై ఎవరికి చెప్పకుండా ఆమె అధిక మోతాదులో మాత్రలను మింగేసింది. ఆమెకు విరోచనాలు కావడంతో ఒక వివాహ భోజనం తినడం వల్లే విరోచనాలు అయ్యాయని భావించి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతుంది. బుధవారం సాయంత్రం ఇంట్లో లభించిన ఖాళీ టాబ్లెట్స్ షీట్లను ఎక్కడివి అని ఆరాతీసి ఆ బాలికను అడగ్గా ఫెయిల్ అయ్యాననే బాధతో మింగానని చెప్పుకొచ్చింది. ఆ తరువాత ఆమె మరణించింది. ఆ బాలికను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు మరణాన్ని ధ్రువీకరించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కుమార్తె ఎంతో కష్టపడి తమ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్న ఆ దంపతుల కుమార్తె మరణంతో వారు తల్లడిల్లిపోయారు.

లారీ ఢీకొని టిప్పర్ లారీ డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 : టిప్పర్ లారీ, ఐషర్ లారీ ఎదురెదురుగా తప్పుకునే సమయంలో తగలడంతో టిప్పర్ లారీ డ్రైవర్ క్రిందకు దిగి చూస్తుండగా అంతలోనే ఐసర్ లారీ వెళ్ళిపోయింది. ఆ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన ఈదుపల్లి పవన్ పోతురాజు (28) భార్య ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. టిప్పర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి ఏలూరు కోడేలు రోడ్డులో మలుపు వద్ద ట్రిప్పర్ లారీ వేసుకువెళ్తున్న పోతురాజుకు మరో ఐషర్ లారీ డ్రైవర్ అడ్డు వచ్చి లారీకి తగిలించాడు. దీంతో పోతురాజు వెంటనే దిగి తన లారీని చూసుకునే సమయంలో ఐషర్‌లారీ పక్క నుంచి వెళ్ళిపోయింది. ఆ రెండు లారీల మధ్యలో పోతురాజు నలిగిపోయి మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డికి అందడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను బెదిరించిన ఒకరికి ఐదేళ్ళ జైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 : ఒంటరిగా ఉన్న ఓ మహిళను పెట్రోల్ పోసి హతమారుస్తానని బెదిరించినట్టు ఒక రేషన్ డీలర్‌పై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు జడ్జి, మహిళా కోర్టు జడ్జి జి రాజేశ్వరి గురువారం తీర్పు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పట్టణానికి చెందిన రేషన్ డీలర్ తూము రాఘవేంద్ర అవినాష్‌బాబు వద్దకు సరుకులు తీసుకోవడానికి వెళ్ళిన ఓ వివాహిత ఫోన్ నెంబర్ తీసుకుని తరచుగా ఫోన్ చేయడంతో ఈ విషయం ఆమె భర్తకు తెలిసి విభేదాలు వచ్చి విడాకులు తీసుకున్నారు. ఆ మహిళ తాడేపల్లిగూడెంలోని తన బంధువుల ఇంటికి వచ్చి ఉంటుంది. తరచుగా రేషన్ డీలర్ అవినాష్‌బాబు ఆమె వద్దకు వచ్చి తన వల్లే కాపురం పోయిందని తనను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకున్నాడు. తన భర్త భరణం ద్వారా వచ్చిన మూడు లక్షల రూపాయలు కూడా తన వ్యాపారంలో పెట్టుబడి పెట్టి లాభాలు ఇస్తానని నమ్మబలికి తీసుకున్నాడు. ఈక్రమంలో పెళ్ళి చేసుకోవాలని నిలదీస్తే పెట్రోల్ పోసి హతమారుస్తానని బెదిరించాడు. బాధితురాలు 2019లో తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడైన అవినాష్‌బాబును అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని మహిళా కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

వేములపల్లిలో 1100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

లింగపాలెం, ఏప్రిల్ 25: లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో నాటుసారా స్థావరాలపై దాడిచేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి ఎన్.సూర్యచంద్రరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ ఆదేశాల మేరకు లింగపాలెం మండలం వేములపల్లిలో ఎస్ఈబీ సిబ్బంది, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 105 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 1100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ కేసులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

89,507 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

▸▸ జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 25: జిల్లాలో ఇప్పటివరకు 89,507 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి గురువారం వెల్లడించారు. జిల్లాలో నేటివరకు 7,097 మంది రైతుల వద్ద నుంచి రూ.186.96కోట్లు విలువైన 89,507 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 11,356 మంది రైతులకు చెందిన 1,15,933 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేశామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. 08812-230448, 77020 03584, 75695 62076, 75695 97910 నంబర్లకు రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకుడు రామన్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 25: ఎన్నికల సంఘం ద్వారా ఏలూరు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకునిగా నియమితులైన తమిళనాడు సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్.ఏ రామన్ గురువారం కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్‌ను ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను కలెక్టర్‌ను రామన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. స్వీప్ కార్యక్రమాల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. వీరి వెంట డీఆర్‌వో డి.పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్ మనస్వికి సత్కారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 25: విద్యార్థులు కష్టపడికాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని సంఘ సేవకులు వల్లకవి పద్మశ్రీనివాసరావు అన్నారు. నూజివీడుకు చెందిన ఏవీఎస్ సాయిమనస్వి ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షాఫలితాల్లో 599 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమర్యాంకు సాధించింది. గురువారం సాయిమనస్విని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థికి రూ.1599 నగదు పురస్కారం అందించి అభినందించారు.

'మెలకువలతో క్రీడల్లో పట్టు సాధించాలి'

దెందులూరు, ఏప్రిల్ 25 : క్రీడాకారులు సంబంధిత ఆటల్లో నిత్యం శోధన చేస్తూ, మెలకువలు తెలుసుకుంటూ పట్టుదలతో క్రీడల్లో పూర్తి పట్టు సాధించాలని ఏలూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ సోమశేఖర్ అన్నారు. గురువారం గోపన్నపాలెం సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతనియాల్ ఆధ్వర్యంలో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల ఆవరణలో ప్రాజెక్టు మీట్ (క్రీడ మోడల్ గేమ్స్ పోటీలు) నిర్వహించారు. బాలికలు, బాలుర విభాగాల్లో ఫుట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించి క్రీడా ఉపాధ్యాయులుగా తయారైన తరువాత క్రీడా పోటీలను ఏవిధంగా నిర్వహించాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టు మీట్‌లో బాలికల విభాగంలో మొదటి స్థానం సాధించిన చైనా నెహల్ జట్టు, రెండో స్థానం సాధించిన శృతి మందన జట్టులకు, బాలుర విభాగంలో మొదటి, రెండో స్థానం సాధించిన జట్లకు నతానియాల్ చేతుల మీదగా క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

శ్రీవారి సేవలో ఎన్నికల పరిశీలనాధికారి



కృష్ణకాంత్ పాఠక్‌కు శ్రీవారి చిత్రపటాన్ని ఇస్తున్న ఈవో త్రినాథరావు

ద్వారకాతిరుమల/ఉంగుటూరు, ఏప్రిల్ 25: చినవెంకన్న ఆలయాన్ని రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి (ఫైనాన్స్), ఏలూరు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్ కృష్ణకాంత్ పాఠక్ గురువారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించగా ఈవో త్రినాథరావు శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉంగుటూరు మండలం నారాయణపురంలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

శ్రీ వారి ట్రస్టుకు రూ. 10 లక్షలు విరాళం



శ్రీవారి ట్రస్టుకు విరాళం అందిస్తున్న దాత కుటుంబసభ్యులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 25: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ దాత కుటుంబం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు, లక్ష్మీ శమంతక మణి దంపతులు తమ పూర్వీకుల పేరున ఈ విరాళాన్ని చెక్ రూపంలో ఈవో త్రినాథరావుకు అందించారు.

డీఎల్‌ఎడ్, టీసీసీ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 :డీఎల్ఎడ్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షకు జిల్లాలో 63 మంది విద్యార్థులకు 59మంది, మొదటి సెమిస్టర్ పరీక్షకు 50 మంది విద్యార్థులకు 48 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక టెక్నికల్ ట్రైనింగ్ కోర్సు (టీసీసీ) పరీక్షల్లో భాగంగా జరిగిన డ్రాయింగ్ లోయర్‌గ్రేడ్ పరీక్షకు 33 మందికి 15 మంది, హయ్యర్‌గ్రేడ్ పరీక్షకు 11మందికి 8మంది హాజరయ్యారని వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

వాహనాల తనిఖీ

లింగపాలెం/ఉంగుటూరు, ఏప్రిల్ 25: లింగపాలెంలో హార్టికల్చర్ ఏడీ జె.శాంతి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఎటువంటి ఉచితాలు పంచకూడదని ఎన్నికలు పారదర్శకంగా జరగాలన్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాల్సి వస్తే సరైన ధ్రువపత్రాలను ఉంచుకోవాలన్నారు. అక్రమంగా మద్యం తరలించకూడదని, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హెడ్‌కానిస్టేబుల్ జయరాజు, డీవీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం ఉంగుటూరులో ఎస్.ఎస్.టీం గురువారం జరిపిన తనిఖీలలో అనుమతి లేని రూ.63వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మే మొదటి వారంలో ఆర్జీయూకేటీ నోటిఫికేషన్?

నూజివీడు టౌన్, ఏప్రిల్ 25: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ ప్రవేశాలకు మే మొదటివారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ఆర్కేవ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో సుమారు 4,400 సీట్లకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా నోటిఫికేషన్‌ను మే మొదటివారంలో విడుదల చేయనున్నట్లు ట్రిపుల్ ఐటీ అధికారవర్గాలు సూత్రప్రాయంగా తెలిపాయి. గ్రామీణ స్థాయిలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచిన వారి మార్కుల ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియను ట్రిపుల్ ఐటీ నిర్వహిస్తోంది. అయితే ప్రతిభ ఉండి అనుకోని ఇబ్బందుల్లో సబ్జెక్టు కోల్పోయిన వారికి సైతం అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో సప్లిమెంటరీ పరీక్షల అనంతరం నోటిఫికేషన్‌ను విడుదల చేస్తూ వస్తోంది. గత రెండేళ్లలో ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ అడ్మిషన్లు పూర్తి అయిన అనంతరం నోటిఫికేషన్, అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించడంతో విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల విషయమై కొంత అయోమయానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆర్జీయూకేటీ అడ్మిషన్‌ల నోటిఫికేషన్‌ను మే మొదటి వారంలో విడుదల చేసేందుకు ఆర్జీయూకేటీ యాజమాన్యం చర్యలు చేపడుతోంది.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి


కైకలూరు ఆర్వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న రామన్

నూజివీడు, ఏప్రిల్ 25: ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్ఏ రామన్ అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి కార్యాలయంలో సీ-విజిల్, ఎంసీసీ, వ్యయ పరిశీలన తదితర విభాగాలను పరిశీలించారు. ఆర్డీవో భవానీ శంకరి రామన్‌ను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ప్రలోభాలకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ర్యాలీలు, బహిరంగ సభల ఖర్చులను అభ్యర్థి ఎన్నికల ఖర్చు ఖాతాలో నమోదు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘనకు సంబంధించి సి-విజిల్ తదితర వాటి ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో తేజోమణి తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: ఎన్నికలకు అన్ని ఏర్పాట్లును కట్టుదిట్టంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ ఎస్ఏ రామన్ అన్నారు. గురువారం కైకలూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకమైన దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో కంప్యుటేషనల్ ల్యాబ్ ప్రారంభం



నూజివీడు టౌన్, ఏప్రిల్ 25: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇనిస్టిట్యూట్ కంప్యుటేషనల్ లేబొరేటరీని ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.80 లక్షల వ్యయంతో ల్యాబ్‌లో డెల్ కంపెనీ నుంచి 60 డెస్క్‌టాప్‌లను తీసుకోవడం జరిగిందని, ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు సహకార ప్రాజెక్టులు, నెట్ వర్కింగ్, అన్వేషణ, పరిశోధనా అవకాశాలతో సహా రకరకాల కార్యకలాపాల్లో తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ గోపాలరాజు, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు నీటి కష్టాలు



ముదినేపల్లి, ఏప్రిల్ 25 : అధికారులకు నీటి కష్టాలు వచ్చి పడ్డాయి. మంచినీటి చెరువులను నింపుకునేందుకు అరకొరగా వస్తున్న నీటితో ఒక పక్క ఇబ్బం దులు పడుతుండగా, పైపుల మరమ్మతుల పనులు కూడా నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురైంది. ముదినేపల్లి మండలంలో ఇంకా పలు గ్రామాల్లో మంచినీటి చెరువులను నింపే ప్రక్రియ జరుగుతూనే ఉంది. పోల్‌రాజ్, బీఎండీ చానల్ కింద చెరువులను నింపే పనిలో ఎంపీడీవో మురళీ గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ నిమగ్నమై ఉండగా, గురువారం లేళ్లపూడి చానల్‌కు నీరు విడుదల చేశారు. ఆ చానల్ నుంచి కోడూరు చెరువుకు వెళ్లే పైపులైన్ పాడైపోవటంతో హడావిడిగా మండుటెండలో అక్కడికి వెళ్లి వారు పైపులను బాగు చేయించాల్సి వచ్చింది. ఇదంతా మండల పరిషత్ అధికారులకు తలకు మించిన భారంగా మారింది.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



ముదినేపల్లి, ఏప్రిల్ 25 : ముదినేపల్లిలో గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటైంది. స్థానిక విజయ లక్ష్మి ఫిష్ ట్రాన్స్‌పోర్టు సంస్థ యజమాని వై.అంకినీడు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలి రోజు సుమారు 800 మందికి ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ముదినేపల్లి మండల చైర్మన్ వెలివెల గోపీనాథ్, సభ్యులు పాల్గొన్నారు. వేసవి ముగిసే వరకు మజ్జిగతోపాటు మంచినీరు కూడా నిత్యం పంపిణీ చేస్తారు.



ముస్లింలకు అండగా కూటమి

ముదినేపల్లి, ఏప్రిల్ 25 : ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ఎన్డీఏ కూటమి అండగా నిలుస్తుందని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ తెలిపారు. గురువారం ముదినేపల్లిలో టీడీపీ కార్యాలయం వద్ద మండలంలోని ముస్లింల ఆత్మీయ సమావేశం వినోద్ ఆధ్వర్యంలో జరిగింది. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మాట్లాడుతూ ముస్లింలకు తెలుగుదేశం పార్టీ అండగానే ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అవగాహన వేదికగా వివాహ వేదిక



మండవల్లి, ఏప్రిల్ 25: మండలంలోని ఉనికిలిలో వివాహ వేదిక ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన వేదికైంది. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ప్రధాన కార్యదర్శి కొరపాటి మార్కురాజు, జ్యోతి వివాహం సందర్భంగా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఓటుహక్కుపై ఫ్లెక్సీ ప్రదర్శించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్. భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి. అప్పారావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కె శాంతరాజు తదితరులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

జగన్మాయ

కైకలూరు కొల్లేరే!



● నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం ● బెదిరింపులు, దౌర్జన్యాలు ● ఇసుక మాఫియా

కైకలూరు నియోజకవర్గ అభివృద్ధికి వైసీపీ నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు.. అభివృద్ధి ఊసే లేదు. అక్రమాలకు మాత్రం అంతులేదు. కొల్లేరు రెగ్యులేటర్ ఏర్పాటు చేస్తామని స్వయంగా జగన్ ఇచ్చిన హామీ గాలికొదిలేశారు. కొల్లేరు అభయారణ్యం పరిధిలో 10 కిలో మీటర్ల పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు ఎమ్మెల్యే కుమారులు ప్రతిపాదనలు ముఖ్యమంత్రి ముందుంచారు. కొల్లేరులో చెరువుల అక్రమ సాగుపై ఆరా తీసిన అధికారిని బదిలీ చేశారు. కైకలూరులో సాగుదారులను బెదిరించి వంద ఎకరాల చెరువు తక్కువ మొత్తంతో బలవంతంగా లీజుకు తీసుకున్నారని, నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల ఆగడాలకు అంతులేదని, ప్రశ్నిస్తే కేసులతో భయపెడుతున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. - కైకలూరు

కొల్లేరు రెగ్యులేటర్ ఎక్కడ జగనన్నా..



ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో కొల్లేరు ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత రూ.470 కోట్లతో అంచనా వేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఐదేళ్లు గడిచినా అతిగతీ లేదు. నియోజకవర్గంలో ప్రధాన సమస్య అయిన తాగునీటి ఎద్దడిని పట్టించుకోలేదు. జల జీవన్ పథకంలో కూడా తాగునీరు అందించలేకపోయారు.


కొవ్వెర్ల కోరుకొల్లు మార్గంలో అప్రోచ్ రోడ్డు లేని వంతెన

నియోజకవర్గం ఐదేళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అవినీతి, దౌర్జన్యాలు, మాటల గారడీకే పరిమితం. తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలను పట్టించుకోకపోవడమే గాక కేంద్రం ప్రవేశపెట్టిన జల జీవన్ మిషన్ పథకం ఇంటింటికి ఉచిత మంచినీటి కనెక్షన్ ద్వారా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. మండవల్లిలో రూ.75 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా నూతనంగా పైపులైన్ల నిర్మాణం అటకెక్కించారు. గ్రామాల్లో రహదారులు నిర్మాణంలో వెనుకబడిపోయారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లే తప్ప వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అక్కడక్కడ మాత్రమే రోడ్లు వేశారు.

కోరుకొల్లు క్యాంపెల్ కాలువపై, ఆవకూరు, కోరుకొల్లు సరిహద్దులో ఉన్న పెదలంక డ్రైన్‌పై వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో 15 ఏళ్ల కిందట కొత్త వంతెన నిర్మించారు. దానికి ఇప్పటికీ అప్రోచ్ రోడ్డు వేయలేదు. కలిదిండిలో వ్యవసాయ రైతుబజారును టీడీపీ ప్రభుత్వంలో 70 శాతం పూర్తి చేసినా ఈ ప్రభుత్వం అసంతృప్తిగానే వదిలివేసింది. పెదలంక డ్రైన్ నిర్మాణం అభివృద్ధి లేక ఈడేపల్లి, పెదగొన్నూరు రైతుల పొలాల నీరు కిందకు వెళ్లకపోవడంతో కనీసం సాగు చేసుకునే పరిస్థితి లేదు. పేదల ఇళ్ల స్థలాలకు భూముల సేకరణలో వైసీపీ నేతలకు కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. కైకలూరులో

కొల్లేరు గ్రీన్‌జోన్‌కు ముప్పు

కొల్లేరు అభయారణ్య పరిధిలో పది కిలోమీటర్ల మేర ఎలాంటి కర్మాగారాల ఏర్పాటుకు అనుమతి లేదు. కానీ ఫ్యాక్టరీల ఏర్పాటుకు అనుమతుల కోసం ఎమ్మెల్యే కుమారులు సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

కొల్లేరులో చేపల చెరువుల అక్రమ తవ్వకాలను అడ్డుకున్న ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్‌ను బదిలీ చేయించారు.

ఎమ్మెల్యే మాట కాదని ఎవరైనా గ్రామాల్లో వ్యతిరేకిస్తే ప్రభుత్వ పథకాల్లో కోతలు పెడుతున్నారని వాపోతున్నారు.

ప్రశ్నిస్తే కేసులు ఎదుర్కొవలసివస్తుందని అవినీతిపై తమకు తెలియదన్నట్లు ప్రజలు గుంభనంగా వ్యవహరిస్తున్నారు.

50 మంది రైతులు లీజుకు చేస్తున్న వంద ఎకరాల చేపల చెరువును ఎమ్మెల్యే తనయుడు బలవంతంగా తీసుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానమైన ఆక్వాసాగుకు పూర్తిగా మొండిచెయ్యి చూపించారు. యూనిట్ విద్యుత్ రేట్లను రూ.3.80పైసలకు పెంచడమే గాక గత ప్రభుత్వంలో వినియోగించుకున్న విద్యుత్ వాడకానికి సైతం కోట్లలో వసూలు చేస్తున్నారు.

నెరవేరని హామీలు

- కలిదిండిలో నూతన అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటుకు కనీస ప్రయత్నాలు జరగలేదు.
- ముదినేపల్లి మండలంలో ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు అందుబాటులో లేవు. 24వేల ఎకరాల్లో దాదాపు 600టన్నుల ఉత్పత్తి నిల్వ సామర్థ్యం లేక రైతులు ఇబ్బందులు గురవుతున్నారు.
- ముదినేపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు ఊసే ఎత్తలేదు.
- కైకలూరు నియోజకవర్గంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు వినతులు పట్టించుకోలేదు.


పేరూరు వద్ద కూలిన పోల్‌రాజ్ డ్రైన్‌పై వంతెన

- పేరూరులో పోల్‌రాజ్ మెయిన్‌డ్రైన్‌పై వంతెన కూలి 3సంవత్సరాలు అయినా నిర్మాణం జరగలేదు. 3కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.
- మండవల్లిలో తరుగుమూలలో 120మందికి ఇళ్ల స్థలాలు మెరక చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. నాలుగున్నరేళ్లుగా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.
- మండవల్లి మండలంలో రెండో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన భవనాలు, ఇతర సామగ్రి, మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు.
- కైకలూరులో పార్కు ఏర్పాటు, పీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు, 50 పడకల ఆసుపత్రి హామీలు నెరవేరలేదు.
- కైకలూరును పంచాయతీ నుండి మున్సిపాలిటీగా మారుస్తామన్న హామీ ఒక్క అడుగు ముందుకు వెళ్లలేదు.
- పెదలంక డ్రైన్‌పై గరిసేపూడి వద్ద పాతరెగ్యులేటర్ పాడైపోవడంతో కొత్త రెగ్యులేటర్ నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు.

రైతుబజారు లేక ఇక్కట్లు



కలిదిండిలో రైతుబజారు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పడమటిపాలెం, పరసావానిపాలెం, ఎస్సార్పీ అగ్రహారం, వెంకటాపురం గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించే రైతులు వాటిని అమ్ముకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాలకు తీసుకువెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది.
ముచ్చు నాగమల్లేశ్వరరావు, కూరగాయల వ్యాపారి

వంతెనపైకి మార్గం లేదు



కోరుకొల్లు వద్ద పెదలంక డ్రెయిన్‌పై నిర్మించిన ఆవకూరు వంతెనకు అప్రోచ్ రోడ్డు లేదు. ఎన్నో సంవత్సరాలుగా అవస్థలకు గురవుతున్నాం. శిథిలావస్థకు చేరిన వంతెనపై రాకపోకలతో భయాందోళనకు గురవుతున్నాం. వంతెన నిర్మించి పదేళ్ళు గడిచినా నిరుపయోగంగా మారింది.
- కేశిరెడ్డి బలరాం

పెదలంక డ్రెయిన్ అభివృద్ధి చేయాలి



పెదలంక మేజర్ డ్రయిన్ దిగువన ముంపు నివారణకు దర్శిపూడి యూటి (అండర్ టన్నెల్) అభివృద్ధి చేయాలి. ఐదేళ్లుగా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రత్యామ్నాయంగా నిడమర్రు వద్ద రూ.40కోట్లతో రెగ్యులేటర్ నిర్మాణానికి నాయకులు హామి ఇచ్చి నేటికి దాని పనులు ప్రారంభించలేదు.
- రెడ్డి నాగరాజు, స్తంభంచెరువు


మండవల్లి మండలంలో కామినేని ప్రచారం


కామినేనితో మట్టగుంట ఎంపీటీసీ, వైసీపీ నాయకులు, వార్డుసభ్యులు

కైకలూరును అగ్రగామిగా నిలుపుతా : కామినేని

మండవల్లి, ఏప్రిల్ 25: అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళిక వేసుకొని కైకలూరును అగ్రగామిగా నిలుపుతానని కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం మండవల్లి మండలం కలవపూడి, శింగనపూడి, ఉనికిలి, సుబ్బారావు పేట, నాగభూషణాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ప్రజలను కామినేని ఓట్లు అభ్యర్థించారు. కమలం గుర్తుపై తనకు, సైకిల్ గుర్తుపై ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం జరుగుతోందని, తన రాజకీయ జీవితంలో ఎక్కడా అవినీతి సంపాదన లేదని, అక్రమంగా కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడడం లాంటివి చేయలేదని, ప్రజలంతా ఆలోచించి మంచి సమాజం కోసం తనకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి ఎన్డీయే కూటమిలో చేరిన 300 మంది కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో కండువాలు కప్పి కామినేని కూటమిలోకి ఆహ్వానించారు. కూటమి నాయకులు నారగాని నాగేశ్వరరావు, జాజుల పార్థసారథి, చాబత్తిన విజయ్, పళ్లెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో చేరిన మట్టగుంట ఎంపీటీసీ

కలిదిండి: మండలంలోని మట్టగుంట ఎంపీటీసీ వడుగు స్వరూప, ఆమె భర్త గణపతితోపాటు పంచాయతీ వార్డు సభ్యులు తిరుమాని ఏడుకొండలు, పెదసింగు చంద్రరావు, కొల్లాటి గోకర్ణ, తిరుమాని వెంకట నారాయణ, కొండంగి వైసీపీ నాయకులు తిరుమలశెట్టి కమల దాస్, నరసింహస్వామి గురువారం కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ సమక్షంలో కూటమిలో చేరారు. వీరికి కామినేని పార్టీ కండువాలు కప్పి కూటమిలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాస్ తదిరతులు పాల్గొన్నారు.


ఆగిరిపల్లిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ

దోమలను నిర్మూలించాలి

మలేరియాపై అవగాహన కార్యక్రమాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 25: మలేరియాపై అప్రమత్తంగా ఉండి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని దిగవల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని దిగవల్లి పీహెచ్‌సీ పరిధిలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు నివాసం ఉంటాయని, వాటి ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా ఆగిరిపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జాస్తి జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ దోమల వల్లే కలిగే వ్యాధుల వల్ల అవగాహన కలిగి ఉండాలని, దోమలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని, మురుగునీరు నిల్వ ఉంచవద్దని కోరారు. నూజివీడు సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద, ఎంపీహెచ్ ఈవో రత్నబాబు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: గురువారం కలిదిండిలో వైద్యాధికారులు, సిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సుచిత మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా జ్వరం వస్తుందని, దోమల నివారించాలని తెలిపారు. ఇంటి ఆవరణంలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లాలని తెలిపారు. కాయిల్స్, దోమ తెరలను వాడాలన్నారు. మలేరియా జ్వరం తీవ్రంగా ఉంటే పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణ కిషోర్, వైద్యాధికారి హేమంత్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మెట్ల కోనేరుకు మోక్షం



ఆగిరిపల్లి, ఏప్రిల్ 25: తుప్పల మధ్య మెట్లకోనేరు శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆగిరిపల్లి శోభనాచల దేవస్థానం ఈవో సురేష్‌బాబు అభ్యర్థన మేరకు పంచాయతీ అధికారులు స్పందించి ఉపాధి పథకంలో భాగంగా 23 మంది కూలీలను చెరువు మెట్లపై పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయటానికి పురమాయించారు. వర్షాలు పడేలోపు చెరువులో పూడిక కూడా తీయిస్తామని సర్పంచ్ చవటపల్లి లక్ష్మీవిక్టర్ తెలియజేశారు.

నేడు నూజివీడులో పుట్టా మహేష్ పర్యటన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 25: టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ శుక్రవారం నూజివీడు మండలంలో పర్యటించనున్నారు. నూజివీడు కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో కలసి శుక్రవారం ఉదయం 8 గంటలకు బత్తులవారిగూడెంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. అనంతరం 11 గంటలకు యనమదల, 12 గంటలకు సుంకొల్లులో, సాయంత్రం 4 గంటల నుంచి సిద్ధార్థనగర్, లయన్ తండా, కొత్తూరు తండా, ఓగిరాల తండాలతో పాటు సాయంత్రం 7 గంటలకు వెంకటాయపాలెం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు.

మనస్వికి పార్థసారథి అభినందన



నూజివీడు టౌన్, ఏప్రిల్ 25: ఆకుల వెంకట నాగసాయి మనస్వి రాష్ట్రానికి తద్వారా, దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చేలా ముందుకు సాగాలని, నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. 10వ తరగతి ఫలితాల్లో 599 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించిన మనస్వి, ఆమె తల్లిదండ్రులు ఏఎస్‌వి ప్రసాద్ దంపతులను ఆయన సత్కరించారు. మనస్వి నూజివీడు ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. కాగా నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు మనస్వి, ఆమె తల్లిదండ్రులను అభినందించారు.

తెలంగాణ సరిహద్దులో విస్తృత తనిఖీలు

చాట్రాయి, ఏప్రిల్ 25: ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తెలంగాణ సరిహద్దులో ఉన్న చాట్రాయి మండలంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కృష్ణారావుపాలెం, పర్వతాపురం చెక్ పోస్టులలో వచ్చి, పోయే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల వల్ల వ్యాపారులు, పెళ్ళిళ్ళకు బంగారం, బట్టల కొనుగోలు చేసేవారు, ఆసుపత్రులకు వెళ్ళేవారు ఇబ్బందులు పడుతున్నారు.